ఆంధ్రజ్యోతి

ఉష్ణోగ్రత సోమవారం గరిష్ఠం : 28.0 కనిష్ఠం : 24.0

ANDHRAJYOTHY



అనంతపురం

జిల్లా వార్తలు

మంగళవారం 19 ఆగస్టు 2025

అర్జీల పరిష్కారంపై దృష్టి సారించాలి: కలెక్టర్



అర్జీదారుడితో మాట్లాడుతున్న కలెక్టర్

అనంతపురం కలెక్టరేట్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో కలెక్టర్ అర్జీలను స్వీకరించారు. కలెక్టర్‌తో పాటు జేసీ శివనారాయణ శర్మ, అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహర్, డీఆర్వో మలోల, ఫారెస్ట్ సెటిల్మెంట్ అధికారి రామకృష్ణారెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు రామ్మోహన్, మల్లికార్జునుడు, ఆనంద్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉమామహేశ్వరమ్మ, ఇతర అధికారులు పాల్గొన్నారు. మొత్తం 550 అర్జీలను స్వీకరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. ముస్సోరీలో శిక్షణలో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందన్నారు. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి 75 మంది ఐఏఎస్ అధికారులు శిక్షణలో పాల్గొన్నారని వివరించారు. ఈ సమయంలో ఇన్‌చార్జ్ కలెక్టర్‌గా ఉన్న జేసీకి కృతజ్ఞతలు తెలిపారు. స్వాతంత్ర్య వేడుకలు బాగా నిర్వహించారని అభినందించారు. పీజీఆర్ఎస్ అర్జీలను ఆయా శాఖల అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వర్షాల వేళ అప్రమత్తంగా ఉండాలి: కలెక్టర్

వర్షాల వేళ ప్రజలంతా అత్యంత అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ వినోద్ కుమార్ సోమవారం ఓ ప్రకటనలో సూచించారు. ఏపీ విపత్తుల సంస్థ సూచనల మేరకు జిల్లాలో పలుచోట్ల పిడుగులు పడే అవకాశం ఉందన్నారు. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడేటప్పుడు చెట్లు, టవర్స్, పోల్స్, పొలాలు, బహిరంగ ప్రదేశాల్లో ఎవరూ ఉండరాదన్నారు. సురక్షితమైన భవనాల్లో ప్రతి ఒక్కరూ ఆశ్రయం పొందాలని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

బాధ్యతలు స్వీకరించిన కలెక్టర్

కలెక్టరేట్‌లో సోమవారం కలెక్టర్ వినోద్‌కుమార్ బాధ్యతలు స్వీకరించారు. ముస్సోరీలో ఐఏఎస్ అధికారుల కోసం నిర్వహించిన మిడ్‌కెరీర్ ట్రైనింగ్ ప్రోగ్రాంలో గత నెల 21 నుంచి ఈనెల 16వరకు పాల్గొని తిరిగి జిల్లాకు వచ్చారు. జిల్లా కలెక్టర్‌కు డీఆర్ఓ మలోల పూలమొక్క అందించి స్వాగతం పలికారు.

రైతు గోడు పట్టదా..?

యూరియా దొరక్క ఇబ్బందులు

- ఆలస్యమవుతున్న పంటల సాగు
- ఇండెంట్ పంపడంలో సిబ్బంది నిర్లక్ష్యం
- వచ్చిన ఎరువులో డీలర్లకే అధిక భాగం
- కృత్రిమ కొరత సృష్టిస్తున్న కొందరు డీలర్లు
- పలు సొసైటీల్లో సగం మాయం
- దిక్కుతోచని స్థితిలో అన్నదాతలు



అనంతపురం అర్బన్/కొత్తచెరువు/బొమ్మనహాళ్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): కరువు రైతుపై కరుణ కరువైంది. ఓవైపు వర్షాలు పడుతున్నాయి, మరోవైపు హెచ్చెల్సీ నీరు వస్తోంది. వెంటనే వరి నాటుకుందామంటే యూరియా లేదు. రైతు సేవాకేంద్రాలు, సొసైటీల వద్దకెళ్తే స్టాక్ లేదంటున్నారు. ప్రైవేటు డీలర్ల వద్దకెళ్లినా అదే సమాధానమే. అధిక ధర చెల్లిస్తే.. అది కూడా అవసరం లేకున్నా.. వేరే ఎరువులు, పురుగు మందులు కొనాలని షరతులు పెడుతున్నారు. లేదంటే యూరియా లేదంటున్నారు. డీలర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నా పర్యవేక్షించాల్సిన అధికారులు చోద్యం చూస్తుండడం విమర్శలకు తావిస్తోంది. కొన్ని సొసైటీల్లో కూడా యూరియాను సొమ్ము చేసుకుంటున్నాయి. సరఫరా అయిన సగం ఎరువులను రైతులకు పంపిణ చేయకుండా పక్క రాష్ట్రానికి విక్రయించి, జేబులు నింపుకుంటున్నారు.

అదనపు ధరలతో దోపిడీ

యూరియా బస్తా (45 కేజీలు) ఎమ్మార్పీ రూ.267. కొందరు డీలర్లు కృత్రిమ కొరత సృష్టిస్తూ అదనంగా వసూలు చేస్తున్నారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో యూరియా బస్తా రూ.300 నుంచి రూ.310 వరకు విక్రయిస్తున్నారు. రాయదుర్గం నియోజకవర్గంలో కొందరు బస్తా రూ.350 నుంచి రూ.400 దాకా విక్రయిస్తున్నట్లు సమాచారం. శ్రీసత్యసాయి జిల్లాలోని పలు ప్రాంతాల్లో యూరియా బస్తా రూ.330 నుంచి రూ.350దాకా విక్రయిస్తున్నట్లు సమాచారం. కొన్ని అన్నదాత, మన గ్రోమోర్ కేంద్రాల్లో యూరియాకు డిమాండ్‌ను సృష్టించి, బస్తా రూ.350 నుంచి రూ.400దాకా విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నట్లు తెలిసింది. అంతటితో ఆగకుండా యూరియా కావాలంటే సూక్ష్మపోషకాలు, క్రిమిసంహారక మందులు, బయో ప్రొడక్ట్‌లు తప్పనిసరిగా కొనుగోలు చేయాలన్న షరతును ప్రైవేటు డీలర్లు విధించినట్లు సమాచారం. యూరియా కోసం తప్పని పరిస్థితుల్లో అవసరం లేకపోయినా ఇతరత్రా వాటిని కొనుగోలు చేయాల్సిన దుస్థితిని రైతులు ఎదుర్కొంటున్నారు. ఇద్దరు హోల్‌సేల్ డీలర్లే అధిక ధరలకు రిటైలర్లకు అంటగడుతున్నట్లు తెలుస్తోంది. శ్రీసత్యసాయి జిల్లాలోని ఓ అధికారితో కుమ్మక్కై తమకే ఎక్కువ శాతం ఎరువులు కేటాయింపులు చేసేలా ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిసింది. పలు కంపెనీలతో కుమ్మక్కై తమకే అధిక శాతం ఎరువులు పంపేలా చక్రం తిప్పుతున్నారన్న విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. సూక్ష్మపోషకాలు తీసుకోవాల్సిందేనన్న షరతు విధించినట్లు సమాచారం. సూక్ష్మపోషకాల



(మిగతా 6లో...)

నలుగురిని బలిగొన్న నిర్లక్ష్యం

- పదిమందికి తీవ్రగాయాలు
- మండ్లిపల్లి వద్ద టెంపోలు.. ఆర్టీసీ బస్సు ఢీ
- పుణ్యక్షేత్రాలకు వెళ్లి వస్తుండగా విషాదం
- బాధితులు బళ్లారి వాసులు



అనసూయమ్మ మృతదేహం



ప్రమాదంలో దెబ్బతిన్న వాహనాలు

స్వస్థలానికి త్వరగా చేరుకోవాలనే ఆత్రం..! ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సును గమనించకుండా.. ముందు వెళుతున్న వాహనాన్ని ఓవర్‌టేక్ చేసే ప్రయత్నం..! డ్రైవర్ నిర్లక్ష్యం అతని ప్రాణాలతోపాటు మరో ముగ్గురి ప్రాణాలను బలితీసుకుంది. తనకల్లు మండల పరిధిలోని మండ్లిపల్లి వద్ద రెండు టెంపో ట్రావెలర్‌లు, ఆర్టీసీ బస్సు సోమవారం ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో బళ్లారి జిల్లా కేంద్రానికి చెందిన అనసూయమ్మ(50), జాహ్నవి(4), డ్రైవర్ మణికంఠ(42), నాగేంద్రప్ప(58) మృతిచెందారు. మరో 10 మందికి తీవ్ర గాయాలయ్యాయి. బాధితులను కదిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, చికిత్స చేయిస్తున్నామని ఎస్ఐ గోపీ తెలిపారు. ఈ ప్రమాదంపై రాష్ట్ర రవాణా శాఖమంత్రి రాంప్రసాద్‌రెడ్డి దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. అధికారులను అడిగి ప్రమాద వివరాలను తెలుసుకున్నారు. గాయపడిన వారికి మెరుగైన చికిత్స చేయాలని ఆదేశించారు. మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపారు.

(వివరాలు మెయిన్‌లో..)



చెక్కవారిపల్లి అడవిలోకి వెళ్తున్న పోలీసులు, స్థానికులు

అడవిలో దొంగలు

- వలవేసి పట్టుకున్న పోలీసులు
- పాణ్యం నుంచి వచ్చి అడవిలో మకాం
- చెక్కవారిపల్లి సమీపంలో స్థావరం

ఇన్నాళ్లూ పోలీసులు 'వల'వేసి పట్టుకున్నారు అని పత్రికల్లో చదువుకున్నాం. కానీ నిజంగానే, నిజమైన వలలు వేసి పట్టుకోవడం ఎప్పుడైనా చూశారా..? పాణ్యం, కదిరి పోలీసులు అంతరాష్ట్ర దొంగల ముఠాను పట్టుకునేందుకు నిజంగానే వలలను వినియోగించారు. అటవీ ప్రాంతంలో స్థావరం ఏర్పాటు చేసుకున్నట్లు డ్రోన్ కెమెరాలతో గుర్తించి, అర్ధరాత్రి వ్యూహాత్మకంగా వేటకు వెళ్లారు. కదిరి రూరల్ సీఐ నాగేంద్ర ఆధ్వర్యంలో ముగ్గురు ఎస్ఐలు, 70 మంది కానిస్టేబుళ్లు, 50మంది స్థానిక యువకులు ఈ ఆపరేషన్‌లో పాలుపంచుకున్నారు.

విషయం ఏమిటంటే..

నంద్యాల జిల్లా పాణ్యం పట్టణానికి చెందిన ఓ ముఠా తలుపుల మండలం చెక్కవారిపల్లి సమీపంలోని అటవీ ప్రాంతంలో, తెల్లగరుగుగుట్టపై స్థావరం ఏర్పాటు చేసుకుంది. ఏపీ సహా పలు రాష్ట్రాల్లో దోపిడీలు, దొంగతనాలు, హత్యలు తదితర నేరాలకు పాల్పడిన ముఠా ఇది. ఇందులో జైలు నుంచి పారిపోయి వచ్చినవారూ ఉన్నారు. ఈ ముఠా సభ్యుల్లో ఒకరు పాణ్యం పోలీసులకు పట్టుబడటంతో గట్టిగా విచారించారు. దీంతో మిగిలినవారు అడవిలో ఉన్నట్లు తేలింది. కరుడుగట్టిన ముఠా కావడంతో పోలీసులు వల పన్ని.. వలలు వేసి మరీ పట్టుకున్నారు.

(వివరాలు మెయిన్‌లో..)

చిన్నారుల తిండిలో కక్కుర్తి..?

- 484 బాలామృతం బ్యాగులు మాయం
- ఆన్‌లైన్లో నమోదు చేయకపోవడంతో బయటపడ్డ వైనం
- లెక్కలు సరిచేయడానికి సిబ్బంది కుస్తీ



శింగనమల ఐసీడీఎస్ కార్యాలయం, బాలామృతం ప్యాకెట్

శింగనమల, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): పిల్లలకు పంపిణీ చేసే పౌష్టికాహారంలో ఐసీడీఎస్ అధికారులు, ఏజెన్సీ నిర్వాహకులు కక్కుర్తికి పాల్పడ్డారని తెలుస్తోంది. శింగనమల ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో చిన్నారులకు పంపిణీ చేసే బాలామృతం బ్యాగులు 484 మాయమయ్యాయి. ప్రాజెక్‌కు బ్యాగులు వచ్చినా వాటిని చిన్నారులకు పంపిణీ చేయకుండా స్వాహా చేశారనే ఆరోపణలు ఉన్నాయి. గత ఏడాది వచ్చిన స్టాక్ వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయకపోవడంతో ఉన్నతాధికారులు గుర్తించి విచారణ చేపట్టడంతో విషయం వెలుగులోకి వచ్చింది. గతంలో ఇక్కడ పనిచేసిన సిబ్బంది రెండు వారాలుగా ఆదివారం రోజు వచ్చి ఆన్‌లైన్‌లో సరిదిద్దడానికి కుస్తీ పడుతున్నట్లు సమాచారం. 2024 జనవరి నెలలో రావాల్సిన బాలామృతం 484 బ్యాగులు (ఒక్కో బ్యాగులో 8ప్యాకెట్ల చొప్పున 3872 ప్యాకెట్లు) మాయంపై విచారణ జరుగుతోంది. అంగన్‌వాడీ కేంద్రాల్లో 7 నెలలు నుంచి 3 సంవత్సరాలోపు చిన్నారులకు ప్రతినెలా 2.50 కిలోల పౌష్టికాహారం ప్యాకెట్ అందిస్తారు. ఇక్కడ పనిచేసిన అధికారులు, బాలామృతం ఏజెన్సీ నిర్వాహకులు కుమ్మక్కై చిన్నారులకు పంపిణీ చేయకుండా స్వాహా చేశారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ ప్రాజెక్టుకు సరాఫరా చేసినట్లు ఎఫ్‌టీఆర్ ఇచ్చారు. అప్పటి అధికారులు, ఏజెన్సీ కలిసి ఆన్‌లైన్‌లో తక్కువ నమోదు చేసినట్లు తెలుస్తోంది. రెండు నెలల కిందట దీనిపై లెక్క తేల్చాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రావడంతో వ్యవహారం బయటకు వచ్చింది.

టెక్నికల్ సమస్యతో నమోదు చేయలేదు

గత సంవత్సరం జనవరి నెలలో బాలామృతం బ్యాగులలో 484 తక్కువ నమోదు చేశారు. ఆ నెలలో బుక్కరాయసముద్రం మండలంలోని రెండు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా బాలామృతం బ్యాగులు చిన్నారులకు పంపిణీ చేసినట్లు రికార్డులు ఉన్నాయి. ఆ సమయంలో టెక్నికల్ సమస్యతో ఆన్‌లైన్‌లో నమోదు చేయలేదు. బ్యాగులు మాయం అయినట్లు వస్తున్న ఆరోపణలు అవాస్తవం.

\- లలితమ్మ, సీడీపీఓ, శింగనమల

ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన శిక్షలు

- సీనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి రాజశేఖర్

అనంతపురం వైద్యం, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): కళాశాలలో తోటి విద్యార్థులపట్ల ఎవరైనా ర్యాగింగ్‌కు పాల్పడితే చట్టరీత్యా కఠిన శిక్షలు అనుభవించాల్సి ఉంటుందని జిల్లా న్యాయసేవ అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి వి.రాజశేఖర్ పేర్కొన్నారు. సోమవారం ప్రభుత్వ వైద్యవిద్య కళాశాలలో యాంటీ ర్యాగింగ్ అవగాహన సదస్సును నిర్వహించారు. ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ షారోన్ సోనియ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సదస్సుకు సీనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి రాజశేఖర్, సీఐ శ్రీకాంత్ యాదవ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. మిమ్మల్ని డాక్టర్లుగా చూడాలన్న ఆకాంక్షతో తల్లిదండ్రులు ఎంతో శ్రమించి ఎంబీబీఎస్ చదివిస్తున్న అంశాన్ని మరిచిపోకూడదని సూచించారు. ర్యాగింగ్ జోలికి వెళితే.. మీ జీవితాన్ని నాశనం చేసుకోవడంతో పాటు తల్లిదండ్రుల కలలు సాకారాన్ని బుగ్గిపాలు చేసినవాళ్లవుతారని హెచ్చరించారు. వ్యాసరచన పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాళ్లు శంకర్, మధుసూదన్, సీనియర్ ఫ్యాకల్టీ శ్రీనివాస్, సరళ, దుర్గ, రమేష్‌బాబు, పద్మశ్రావణి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ పరదేశీనాయుడు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న న్యాయాధికారి రాజశేఖర్

ఓటరు భద్రతే కాంగ్రెస్ కర్తవ్యం

- రాహుల్‌కు మద్దతుగా యావత్ దేశం
- డీసీసీ అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి



ఓట్ చోర్ ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

అనంతపురం వైద్యం, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కు చోరీ కాకుండా ఓటరుకు భద్రత కల్పించడమే కాంగ్రెస్ కర్తవ్యమని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఓట్ చోర్ - గద్ది చోర్ ర్యాలీ నిర్వహించారు. నగరంలోని క్లాక్‌టవర్ నుంచి కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వరకు సాగిన ర్యాలీకి మధుసూదన్‌రెడ్డితో పాటు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాకే శివశంకర్, మైనార్టీ విభాగాధ్యక్షుడు దాదాగాంధీ, కార్యదర్శి యంయండీ ఇమామ్ ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా ఓట్ల గల్లంతు జరుగుతోందన్నారు. దేశప్రజలంతా రాహుల్ గాంధీకి మద్దతుగా నిలవడంతో అధికార బీజేపీకి కలవరింపు మొదలయిందన్నారు. ఓట్ చోర్ లెక్కలు తేల్చేంతవరకు రాహుల్ గాంధీకి దేశప్రజల మద్దతు ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు సూర్యనారాయణరెడ్డి, సోనీసీన, అబ్బాస్, ప్రసాద్‌రెడ్డి, కృష్ణ, అహ్మద్, నరసింహారెడ్డి, పోలక్క, రామాంజనేయులు, మొహిద్దీన్, బొజ్జప్ప, ఈశ్వర్ ప్రసాద్, ఓబులేసు, కిషోర్‌రెడ్డి పాల్గొన్నారు.

రోజంతా హై టెన్షన్..

మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డిని అడ్డుకున్న పోలీసులు

- తాడిపత్రికి బయల్దేరిన పెద్దారెడ్డి
- మధ్యలోనే అడ్డుకున్న పోలీసులు
- వెనక్కి వెళ్లాలని సూచన
- ససేమిరా అన్న మాజీ ఎమ్మెల్యే
- ఆరుగంటలపాటు రోడ్డుపైనే బైఠాయింపు
- ఎట్టకేలకు వెనక్కి పంపించిన పోలీసులు

7



రాత్రి 12 వరకూ బార్లు

- 1 నుంచి కొత్త బార్ పాలసీ
- ఉమ్మడి జిల్లాలో 30 బార్లకు దరఖాస్తుల ఆహ్వానం
- ఈనెల 26 వరకు గడువు
- ప్రొహిబిషన్, ఎక్సైజ్ డీసీ నాగమద్దయ్య

వివరాలు 7లో...



ఇంకా అక్కడే..!

డిజిటల్ యుగానికి దూరంగా వైద్య కళాశాల

- పాత పద్ధతిలోనే బోధన
- తరగతి నుంచి గ్రంథాలయం వరకూ అంతే..
- కంప్యూటర్లు, ఇంటర్నెట్, వైఫై నిల్
- విద్యార్థులకు ఇబ్బందులు



ఓపీలోని ఇరుకు గదిలో పాఠాలు బోధిస్తున్న ప్రొఫెసర్

6

నార్పల మహిళా మార్ట్ పరిశీలన

నార్పల, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో వెలుగు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహిళా మార్ట్‌ను కేంద్ర ప్రభుత్వ గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి టీకే అనిల్‌కుమార్ సోమవారం పరిశీలించారు. మార్ట్‌లో క్రయ, విక్రయాలు ఎలా జరుగుతున్నాయి, టర్నోవర్ ఎంత, నిర్వహణ ఎలా జరుగుతుంది, తదితర విషయాలు అడిగి తెలుసుకున్నారు. రూ.11.80 లక్షల లాభంలో నార్పల మహిళా మార్ట్ జిల్లాలోనే ప్రథమ స్థానంలో ఉందని అధికారులు తెలిపారు. సుల్తాన్‌పేటలో స్నేహ కంప్యూటర్ ఎంబ్రాయిడింగ్ కేంద్రాన్ని సందర్శించి అందులో తయారయ్యే వస్తువులను పరిశీలించారు. కొత్తబస్టాండ్ సమీపంలో శ్వేత గానుగ, బొందలవాడలో రాధిక బెల్లం తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహర్, పీడీ శైలజ, అడిషినల్ సీఈఓ శ్రీరాములు నాయుడు, సెర్ప్ డైరెక్టర్ శివశంకర్ ప్రసాద్, తహసీల్దార్ అరుణకుమారి, ఎంపీడీఓ మమతాదేవి, డిప్యూటీ ఎంపీడీఓ శైలజరాణి, డీపీఎంలు గంగాధర, సత్యనారాయణ, శ్రీనివాసులు, వెంకట్రావు పాల్గొన్నారు.



మార్ట్‌లో సిబ్బందితో మాట్లాడుతున్న టీకే అనిల్‌కుమార్

- అనంతపురం కలెక్టరేట్ : కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి టీకే అనిల్‌కుమార్ జిల్లా పర్యటన నిమిత్తం సోమవారం నగరంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహానికి చేరుకున్నారు. ఆయనను కలెక్టర్ వినోద్‌కుమార్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయనతో పాటు జేసీ శివనారాయణ శర్మ, అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహర్ ఉన్నారు.

అంబేడ్కర్ జీవితం ఆదర్శప్రాయం

విగ్రహావిష్కరణలో ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, పరిటాల శ్రీరామ్



అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎంఎస్ రాజు, పరిటాల శ్రీరామ్

రామగిరి, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీవితం నేటి తరానికి ఆదర్శనీయమని మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ అన్నారు. సోమవారం మండలంలోని గరిమేకలపల్లిలో అంబేడ్కర్ విగ్రహాన్ని వారు ఆవిష్కరించారు. టీడీపీ సీనియర్ నాయకుడు ఎల్.నారాయణచౌదరి సహకారంతో విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. గ్రామస్థులు పెద్దఎత్తున కలశాలతో వచ్చి డప్పులు వాయిస్తూ సందడి చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతిఒక్కరు అంబేడ్కర్ జీవితాన్ని చదివితే కష్టాలు ఎలా ఉంటాయి, ఉన్నతస్థాయికి ఎలా ఎదగాలనేది తెలుస్తుందన్నారు. అనేక వివక్షలు, అవమానాలు, ఎదురుదెబ్బలను తట్టుకుని ఉన్నత చదువులు చదివారంటే అంబేడ్కర్ శ్రమ ఎంత ఉందో అర్థం చేసుకోవచ్చని అన్నారు. దళితులు చెరువుల్లో నీటిని తాగకుండా అడ్డుకుంటున్న రోజుల్లో అంబేడ్కర్ మార్గం చూపించారని తెలిపారు. అదే స్ఫూర్తితో వెంకటాపురంలో పరిటాల శ్రీరాములు దళితులకు బావిలో నీరు ఇచ్చి ఆదర్శంగా నిలిచారని గుర్తు చేశారు. పరిటాల కుటుంబానికి దళితులు అండగా నిలిచి వెన్నంటే ఉన్నారని తెలిపారు. అభివృద్ధి గురించి చెప్పాలంటే పరిటాల అనే నాలుగు అక్షరాలు లేకుండా చెప్పలేమని ఎంఎస్ రాజు అన్నారు. కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

జేవీవీ జిల్లా కమిటీ ఎన్నిక



కన్నేపల్లి చిత్తప్ప



కెంచాల వీరరాజు

అనంతపురం టౌన్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): జన విజ్ఞాన వేదిక (జేవీవీ) జిల్లా కమిటీ ఎన్నికైంది. జిల్లా కేంద్రంలోని జేవీవీ జిల్లా కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు గేయానంద్ అధ్యక్షతన మొత్తం 41 మందితో కూడిన కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. జిల్లా కమిటీ అధ్యక్షుడిగా కళ్యాణదుర్గానికి చెందిన కన్నేపల్లి చిత్తప్ప, ప్రధాన కార్యదర్శిగా అనంతపురానికి చెందిన కెంచాల వీరరాజు, కోశాధికారిగా మహమ్మద్ జిలాని, గౌరవాధ్యక్షులుగా డాక్టర్ రంగన్న, డాక్టర్ పి.ప్రసూన, సాకే భాస్కర్, సలహాదారులుగా మల్లికార్జున, వీకే పద్మావతిని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా రామిరెడ్డి, శివానంద, శశికళ, ప్రసాద్‌రెడ్డి, రాజన్న, నాగరత్న, కార్యదర్శులుగా తిరుపాలు, తిప్పేస్వామి, రాఘవేంద్ర, సింహాద్రి, రంగనాథ్, రామచంద్రయ్యను ఎన్నుకున్నారు.

22న వరిధాన్యం వేలం

కణేకల్లు, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో గల వ్యవసాయ విత్తనోత్పత్తి క్షేత్రంలో పండిన 124 క్వింటాళ్ల స్ర్కీన్ రిజెక్షన్ వరి ధాన్యాన్ని ఈ నెల 22వ తేదీన వేలం వేస్తున్నట్లు ఫాం ఏడీఏ నారాయణనాయక్ పేర్కొన్నారు. డీపీటీ 5204, 2846 రకాలకు చెందిన ధాన్యాన్ని అనంతపురంలోని ప్రసన్నాయపల్లిలో ఉన్న ఏపీ సీడ్స్ జిల్లా కేంద్రంలో ఈ వేలం నిర్వహిస్తామని, ఆసక్తిగలవారు ముందుగా రూ.50 వేలు డీడీలు చెల్లించి వేలంలో పాల్గొనాలన్నారు.

చీనీ టన్ను రూ.20 వేలు

అనంతపురంరూరల్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): నగరంలోని వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం సీజనల్ చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.20వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి గోవిందు తెలిపారు. అలాగే కనిష్ఠంగా రూ.10వేలు, సరాసరి ధర రూ.13వేలు పలికాయన్నారు. మార్కెట్‌కు మొత్తంగా 855 టన్నుల చీనీకాయలు వచ్చినట్లు పేర్కొన్నారు.

21న మాజీ సైనికుల పరిష్కార వేదిక

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని మాజీ సైనికులకు ఈనెల 21వతేదీన అనంతపురంలోని జిల్లా సైనిక సంక్షేమశాఖ కార్యాలయంలో పరిష్కారవేదిక నిర్వహించనున్నట్లు ఆ శాఖ జిల్లా అధికారి పి. తిమ్మప్ప తెలిపారు. మద్రాస్ రెజిమెంటల్ అధికారులు హాజరై మాజీ సైనికులు, వితంతువుల సమస్యలకు సంబంధించిన అర్జీలు స్వీకరిస్తారని తెలిపారు. పార్ట్-11 ఆర్డర్, పెన్షన్ ఇతర సమస్యలను విన్నవించుకుని పరిష్కరించుకోవాలని అన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబరు 08554-241146ను సంప్రదించాలని తెలిపారు.

డీడీఓగా నాగశివలీల

అనంతపురం న్యూటౌన్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): అనంతపురం డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ (డీడీఓ)గా నాగశివలీల నియమితులయ్యారు. జిల్లా పరిషత్ కార్యాలయ ఆవరణంలో ఉన్న డీడీఓ కార్యాలయంలో సోమవారం ఆమె బాధ్యతలు చేపట్టారు. కర్నూలు జిల్లా మెప్మా పీడీగా ఉన్న నాగశివలీలను డీడీఓ గా నియమించారు. ఇప్పటి వరకు ఉన్న డీడీఓ లీలాభాయ్ బదిలీ కావడంతో ఆ స్థానంలో ఇన్‌చార్జ్‌గా డీఎల్‌పీఓ విజయ్‌కుమార్‌ను నియమించారు. రెగ్యులర్ డీడీఓ రావడంతో ఆయన రిలీవ్ అయ్యారు.

ఆర్‌డబ్ల్యూఎస్ డీఏఓగా నాగరాజు

అనంతపురం న్యూటౌన్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): గ్రామీణ నీటి సరఫరా విభాగం జిల్లా అకౌంట్స్ అధికారి (డీఏఓ)గా నాగరాజు నియమితులయ్యారు. గతంలో ఇక్కడ డీఏఓగా ఉన్న మునీంద్ర జూన్ నెలలో ఉద్యోగ విరమణ పొందారు. దీంతో ఆ స్థానంలో పీఆర్ పీఐయూ డీఏఓగా ఉన్న పద్మావతికి ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. దీంతో కర్నూలులో ఏపీ ఎంఎస్ఐడీసీ మెడికల్ విభాగంలో డీఏఓగా ఉన్న నాగరాజును అనంతపురం ఆర్‌డబ్లూఎస్ డీఏఓగా బదిలీ చేశారు. దీంతో ఆయన ఇక్కడ బాధ్యతలు చేపట్టారు.

ఇంకా అక్కడే..!



ప్రొజెక్టర్ డిస్‌ప్లే బోర్డు



అల్మరాల్లో పాత పుస్తకాలు

అనంతపురం వైద్యం, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): సూపర్ కంప్యూటర్ నుంచి క్వాంటమ్ యుగానికి రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. క్వాంటమ్ కంప్యూటింగ్‌తో వైద్య రంగంలో పెనుమార్పులు రానున్నట్లు వైద్యనిపుణులు చెబుతున్నారు. ఒక కణాన్ని పరీక్షించి ఆ వ్యక్తిలో ఎలాంటి ఆరోగ్య సమస్యలు ఉన్నాయో తెలుసుకునే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని అంటున్నారు. తద్వారా ప్రాణాంతక వ్యాధులను సైతం ఆదిలోనే నివారించే సామర్థ్యాన్ని అందుకోబోతున్నామని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో.. తాము మాత్రం నేటికీ పాతపద్ధతిలోనే చదువులు కొనసాగిస్తున్నామని అనంతపురం ప్రభుత్వ వైద్యవిద్య కళాశాల విద్యార్థులు వాపోతున్నారు. మెడికల్ కాలేజ్, సూపర్ స్పెషాలిటీ, జనరల్ హాస్పిటల్స్‌లో డిజిటల్ క్లాస్‌రూమ్స్ వెతికినా కనబడవు. కళాశాలను ఏర్పాటు చేసిన కాలంనాటి పద్ధతిలోనే వసతులున్నాయని మండిపడుతున్నారు.

పాత పద్ధతిలోనే వైద్య కళాశాల

ప్రభుత్వ వైద్యవిద్య కళాశాలకు త్వరలోనే సిల్వర్‌జూబ్లీ వేడుకలు నిర్వహించబోతున్న తరుణంలోనూ అప్‌డేట్ కావడంలేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండు, మూడు దశాబ్దాల క్రితంనాటి పుస్తకాలనే చదవాల్సివస్తోందని పేర్కొంటున్నారు. కాలం మారింది, వ్యాధులు రూపాంతరం చెందాయి.. అందుకు తగిన విద్యా వసతులు సమకూర్చడంలో ఉన్నతాధికారులు విఫలమవుతున్నారని మండిపడుతున్నారు. గ్రంథాలయంలో కంప్యూటర్లు, ఇంటర్నెట్, వైఫై వంటి కనీస సదుపాయాలు కూడా లేవని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధ్యాపకులు వారు చదువుకున్న పాత పద్ధతుల్లోనే బోధిస్తున్నారు. ప్రొజెక్టర్ డిస్‌ప్లేగా వైట్‌బోర్డ్‌ను ఉపయోగిస్తున్నారు. క్లాస్ మధ్యలో ప్రొజెక్టర్లు మొరాయిస్తున్నాయి. పాత పుస్తకాలతో సిలబస్‌లోని అనుమానాలను నివృత్తి చేసుకోవడం కష్టంగా మారింది. దీంతో పుస్తకాలు కొనేందుకు ప్రతి సంవత్సరం రూ.10వేల నుంచి రూ.20వేలు ఖర్చు చేయాల్సి వస్తోందని వాపోతున్నారు.

డిజిటలైజేషన్‌కు దూరం

వైద్య కళాశాలలో 27 మంది ప్రొఫెసర్లు, 66 మంది అసోసియేట్ ప్రొఫెసర్లు, 146 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లు, 14 మంది ట్యూటర్లు ఇలా.. మొత్తం 250 మంది వరకు టీచింగ్ ఫ్యాకల్టీ పనిచేస్తున్నారు. మొత్తం 44 విభాగాలు ఉన్నాయి. ప్రతి విభాగానికి ప్రత్యేకంగా డిజిటల్ క్లాస్ రూమ్, సెమినార్, రీసెర్చ్ ప్రజెంటేషన్ డిజిటల్ హాల్స్‌ను ఏర్పాటు చేయాలి. ఓపీ, ఐపీ, ఓటీల వారిగా ప్రత్యక్ష శిక్షణతోపాటుగా తరగతి గదులు రూపొందించాలి. ఏ ఒక్క విభాగం డిజిటలైజేషన్ కాలేదని విద్యార్థులు ఆవేదన చెందుతున్నారు.

ఎఫ్‌డీపీ నిర్వీర్యం

ప్రస్తుతం మొత్తం 250 మంది వరకు టీచింగ్ ఫ్యాకల్టీ పనిచేస్తున్నారు. వీరిలో అత్యధిక మందికి డిజిటల్ గాడ్జెట్స్‌ను ఉపయోగించడం తెలియదని విద్యార్థులు చెబుతున్నారు. ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం(ఎఫ్‌డీపీ) విభాగాన్ని నిర్వీర్యం చేయడమే ఇందుకు కారణమని మండిపడుతున్నారు. డిజిటల్ యుటిలైజేషన్‌పై ఫ్యాకల్టీకి ట్రైనింగ్ ఇస్తేనే తగిన విధానంలో బోధిస్తారని పేర్కొంటున్నారు. సమయం దొరికినప్పుడు క్లాస్ తీసుకున్నామా, పాఠాలు పూర్తిచేశామా అన్న ధోరణిలో ఫ్యాకల్టీ వ్యవహరిస్తోందని మండిపడుతున్నారు. డిజిటలైజేషన్‌కు అనుగుణంగా అప్‌డేట్ కావాలన్న ఆకాంక్ష ఫ్యాకల్టీలో లేదనే విమర్శలు వస్తున్నాయి. కళాశాల నిర్వహణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు కేటాయిస్తున్నాయి. నిధులను దుర్వినియోగంచేస్తూ తమకు అన్యాయం చేస్తున్నారని విద్యార్థులు ఆరోపిస్తున్నారు.

అనంత మాకొద్దు..

అనంతపురం మెడికల్ కాలేజ్‌లో తమ పిల్లలను అడ్మిషన్ చేయించాలంటే వెనకడుగు వేయాల్సి వస్తోందని విద్యార్థుల తల్లిదండ్రులు పేర్కొంటున్నారు. నీట్ కౌన్సెలింగ్ ప్రక్రియలో ఆల్ ఇండియా ర్యాంకుల్లో ఉత్తర భారత రాష్ట్రాలు, స్టేట్ ర్యాంకుల్లో ఇతర జిల్లాల్లోని మెడికల్ కాలేజ్‌లను ఎంచుకోవాల్సి వస్తోందని చెబుతున్నారు. ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఎక్యూప్‌మెంట్స్, డిజిటల్ క్లాసెస్ తదితర అంశాల్లో అనంతపురం మెడికల్ కాలేజ్ వెనుకబడటంతో వదులు కోవాల్సిన దుస్థితి నెలకొందని వాపోతున్నారు.

ఉన్నతాధికారులకు వివరించాం

డిజిటలైజేషన్ టీచింగ్‌కు అవసరమైన సదుపాయాల వివరాలను ఉన్నతాధికారులకు వివరించాం. కంప్యూటర్ లైబ్రరీ, డిజిటల్ క్లాస్‌బోర్డ్స్, సెమినార్ గ్యాలరీస్ ఇలా అన్నిరకాల అవసరాలను సమకూర్చేందుకు కృషిచేస్తున్నాం. ఇంటర్నెట్, వైఫై కనెక్షన్లు తరచూ మరమ్మతులకు గురవుతున్నాయి.

-ప్రొఫెసర్ షారోన్ సోనియా, ప్రిన్సిపాల్, వైద్య కళాశాల

రైతు గోడు పట్టదా..?

(5వ పేజీ తరువాయి)

ధరల్లోనూ అదనంగా వసూలు చేస్తుండటం గమనార్హం. శ్రీసత్యసాయి జిల్లాలో ఎరువుల సరఫరా, పంపిణీ వివరాలు గోప్యంగా ఉంచుతుండడం అనుమానాలకు తావిస్తోంది.

సగం మాయం..

ఉమ్మడి అనంత జిల్లాలో సొసైటీలకు సరఫరా చేసిన యూరియాలో సగం మాయం చేస్తున్నారన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. అనంత జిల్లాలోని 15 సొసైటీలకు ఈ ఏడాది ఏప్రిల్ నుంచి జూలైదాకా 2,784 మెట్రిక్ టన్నుల యూరియాను ఏపీ మార్క్‌ఫెడ్ యంత్రాంగం సరఫరా చేసింది. సొసైటీల్లో ఎమ్మార్పీకే యూరియా విక్రయాలు చేపడుతుండడంతో ఎక్కువ శాతం మంది రైతులు ఆయా కార్యాలయాల వద్ద యూరియా కోసం క్యూ కడుతున్నారు. ఒక్కో రైతుకు 2 బస్తాల యూరియా మాత్రమే పంపిణీ చేస్తూ సొసైటీ ప్రతినిధులు చేతులు దులుపుకుంటున్నారు. కొన్ని సొసైటీల ప్రతినిధులు తమకు కేటాయించిన యూరియాలో సగం శాతం కర్ణాటక, ఇతర ప్రాంతాలకు తరలించి అధిక ధరకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. రైతు సేవా కేంద్రాలకు ఇండెంట్ మేరకు యూరియా సరఫరా చేయలేదు, కొన్ని రైతు సేవాకేంద్రాల నుంచి ఇప్పటిదాకా ఇండెంట్ పెట్టలేదన్న వాదనలు వినిపిస్తున్నాయి. దీంతో ఆయా ప్రాంతాల రైతులు యూరియా కష్టాలు ఎదుర్కొంటున్నారు.



బొమ్మనహాళ్ రైతు సేవాకేంద్రం వద్ద యూరియా కోసం వేచివున్న రైతులు (ఫైల్)

వరి నాట్లు ఎలా వేయాలి?



హెచ్చెల్సీ ఆయకట్టు కింద 12 ఎకరాల్లో వరి సాగు చేసేందుకు సిద్ధంగా ఉన్నా. 25 బస్తాల యూరియా అవసరం. సొసైటీలో స్టాక్ లేదని చెబుతున్నారు. రైతు సేవా కేంద్రంలో అడిగినా అదే మాట అంటున్నారు. వరి నాట్లు వేసే సమయంలో యూరియా తప్పనిసరిగా వేయాలి. ఈ తరుణంలో యూరియా ఇవ్వకపోతే ఎలా? బహిరంగ మార్కెట్‌లో అధిక ధరలకు విక్రయిస్తున్నారు. అది కూడా పలుకుబడి ఉన్నవారికే ప్రాధాన్యత ఇస్తున్నారు. మాలాంటి సామాన్య రైతులకు యూరియా దొరకడం కష్టమే.

- రైతు శ్రీనివాసులు, బొమ్మనహాళ్

రెండు బస్తాలు ఇస్తే ఎలా..?



27 ఎకరాల్లో వరి సాగు చేయాలనుకున్నా. కనీసం 25 బస్తాల యూరియా అవసరం అవుతుంది. ఒక్కో రైతుకు 2 బస్తాలు మాత్రమే ఇస్తామంటే ఎలా సరిపోతుంది? మిగిలిన యూరియా కోసం ఎక్కడికి వెళ్లాలి. ప్రభుత్వం యూరియా సమస్యను పరిష్కరించేందుకు వెంటనే చర్యలు చేపట్టాలి.

-రైతు బసన్న, బొమ్మనహాళ్

డీసీఎంఎస్ వద్ద తోపులాట



యూరియా కోసం క్యూలో నిల్చున్న రైతులు

అనంతపురం క్లాక్‌టవర్(ఆంధ్రజ్యోతి): యూరియా కోసం జిల్లా కేంద్రంలోని డీసీఎంఎస్ వద్ద సోమవారం రైతుల మధ్య తోపులాట జరిగింది. డీసీఎంఎస్‌లో ఎమ్మార్పీకే యూరియా విక్రయిస్తారు. దీంతో జిల్లాకేంద్రానికి సమీపంలోని మండలాల రైతులు కమలానగర్‌లో ఉన్న డీసీఎంఎస్‌కు వచ్చి కొనుగోలు చేసుకుని, తీసుకెళ్లారు. ఒక్కో రైతుకి మూడు యూరియా బస్తాలు ఇస్తారు. సుమారు 8 లోడులు వస్తే సర్దుబాటు చేయొచ్చు. సోమవారం 280 బస్తాలు ఉండే ఒక లారీ లోడు వచ్చింది. 600మందికిపైగా రైతులు డీసీఎంఎస్‌కు చేరుకున్నారు. యూరియా కోసం రైతుల క్యూ చాంతాడంత కనిపించింది. యూరియా దొరుకుతుందో, లేదోనని రైతులు ఎగబడడంతో తోపులాట జరిగింది. డీసీఎంఎస్ చైర్మన్ నెట్టెం వెంకటేష్, మేనేజర్ విజయ్‌భాస్కర్ జోక్యం చేసుకుని, విషయం పోలీసులకు చేరవేశారు. పోలీసులు అక్కడికి చేరుకుని పరిస్థితిని అదుపుచేశారు. మార్క్‌ఫెడ్, వ్యవసాయశాఖ ఉన్నతాధికారులతో మాట్లాడి రైతులకు అవసరమైనంత యూరియా సరఫరా చేసేందుకు కృషి చేస్తామని డీసీఎంఎస్ చైర్మన్ నెట్టెం వెంకటేశులు తెలిపారు. రైతులు ఎవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదని, ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని పేర్కొన్నారు.

యూరియా ఇతర అవసరాలకు

వాడితే చర్యలు: కలెక్టర్



అనంతపురం కలెక్టరేట్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): యూరియా వ్యవసాయానికి కాకుండా ఇతర అవసరాలకు వినియోగిస్తే చర్యలు తీసుకుంటామని కలెక్టర్ వినోద్‌కుమార్ హెచ్చరించారు. కలెక్టరేట్‌లో సోమవారం యూరియాపై జిల్లాస్థాయి సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాకు ఈ ఏడాది ఖరీఫ్‌లో 26,839 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం కాగా, మొత్తం 29,527 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా అయిందన్నారు. అందులో 26,008 మెట్రిక్ టన్నులు విక్రయించగా, ఇంకా 3,519 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉందన్నారు. జిల్లాలో యూరియా వినియోగంపై డీఎస్ఓ, ఇండస్ట్రీస్, లేబర్, ఎక్సైజ్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్, డీటీసీ, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, పోలీస్, అగ్రికల్చర్ అధికారులతో కమిటీ ఏర్పాటు చేశామన్నారు. వ్యవసాయానికి కాకుండా వేరేదానికి ఉపయోగించారా అన్నదానిపై తనిఖీలు చేసి, 48 గంటల్లో నివేదిక ఇవ్వాలన్నారు. ఎంత యూరియా కేటాయించారు, ఎంత పంపిణీ చేశారన్న వివరాలపై నివేదిక ఇవ్వాలన్నారు. సమావేశంలో జేసీ శివనారాయణ శర్మ, డీఆర్వో మలోల, ఎఫ్ఎస్ఓ రామకృష్ణారెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు రామ్మోహన్, మల్లికార్జునుడు, ఆనంద్, జిల్లా వ్యవసాయ శాఖాధికారి ఉమామహేశ్వరమ్మ, డీటీసీ వీర్రాజు, పరిశ్రమల శాఖ జీఎం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఎన్‌హెచ్ పనులను వేగవంతం చేయాలి

- కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం కలెక్టరేట్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎన్‌హెచ్ 544డి పనులను వేగవంతంగా చేపట్టాలని కలెక్టర్ వినోద్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ఎన్‌హెచ్ 544డి పనులు, ఇతర అంశాలపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... 544డి పనులను వేగవంతంగా చేపట్టాలన్నారు. జిల్లాలో అనంతపురం రూరల్‌లోని సోములదొడ్డి నుంచి ముచ్చుకోట వరకు 37కిలో మీటర్లు, ముచ్చుకోట నుంచి బుగ్గ గ్రామం వరకు 32 కిలోమీటర్లు ఎన్‌హెచ్ 544డి పనులను చేపడుతున్నారని అన్నారు. పెండింగ్‌లో ఉన్న భూసేకరణ త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. భూసేకరణకు సంబంధించి వారానికి ఒకసారి సమీక్ష నిర్వహిస్తామని తెలిపారు. సమావేశంలో జేసీ శివనారాయణ శర్మ, డీఆర్ఓ మలోల, అనంతపురం ఆర్డీఓ కేశవనాయుడు, ఎన్‌హెచ్ పీడీ తరుణ్‌కుమార్, ఈ సెక్షన్ సూపరింటెండెంట్ రియాజుద్దీన్, డీటీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో పురోగతి తీసుకురావాలి

ఉపాధి హామీ పథకం పనుల్లో కేటాయించిన లక్ష్యానికి అనుగుణంగా పురోగతి తీసుకురావాలని కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ఉపాధి హామీ పథకం పనులు, హౌసింగ్, తదితరఅంశాలపై డ్వామా పీడీ, హౌసింగ్ పీడీ, ఎంపీడీఓలు, ఏపీడీలు, ఏపీఎంలు తదితరులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలో ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన సీసీ రోడ్లు, సీసీ డ్రెయిన్లు, బీటీ రోడ్ల పెండింగ్‌ను వెనుకబడిన మండలాలు పూర్తి చేయాలన్నారు. వివిధ అంశాల్లో కేటాయించిన లక్ష్యానికన్నా పురోగతి తక్కువగా ఉందని, వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. హౌసింగ్ కింద జిల్లాకు కేటాయించిన ఇళ్ల నిర్మాణ లక్ష్యాన్ని పూర్తిచేయాలని ఆదేశించారు. వీసీలో డ్వామా పీడీ సలీమ్‌బాషా, హౌసింగ్ పీడీ శైలజ తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగి ఆత్మహత్య

నేత్రదానం చేయించిన తల్లిదండ్రులు



ప్రకాష్‌నాయుడు (ఫైల్)

తాడిమర్రి, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిల్లకొండయ్యపల్లికి చెందిన ప్రకాశ్‌నాయుడు (22)అనే బీటెక్ చదివిన నిరుద్యోగి ఆదివారం రాత్రి అనంతపురంలో ఆత్మహత్య చేసుకున్నాడు. చిల్లకొండయ్యపల్లికి చెందిన మనోహర్‌నాయుడు, రమణమ్మ కుమారుడు ప్రకాశ్‌నాయుడు నరసరావుపేటలోని ఏఎంరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో ఏడాది క్రితం బీటెక్ పూర్తిచేశాడు. అప్పటి నుంచి అనంతపురంలో ఉంటూ ఉద్యోగం ప్రయత్నం చేస్తున్నా దొరకలేదు. దీంతో మనస్థాపానికి గురై ఆదివారం రాత్రి అనంతపురంలో ఆత్మహత్య చేసుకున్నాడు. తమ కుమారుడి నేత్రాలను దానం చేసి మరొక ఇద్దరికి కంటిచూపు ప్రసాదించాలని నిర్ణయించుకుని ప్రకాశ్‌నాయుడు నేత్రాలను దానం చేశారు.

స్కాలర్‌షిప్ పరీక్షకు దరఖాస్తు చేసుకోండి

హిందూపురం, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): దీనదయాల్ స్పర్శ యోజన స్కాలర్‌షిప్ పరీక్ష కోసం దరఖాస్తు చేసుకోవాలని పోస్టల్ సూపరింటెండెంట్ విజయ్‌కుమార్ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 6వ తరగతి నుంచి 9వ తరగతి వరకు చదువుతున్న.. గత యేడాది 60శాతం ఉత్తీర్ణత సాధించినవారు సెప్టెంబరు 16లోపు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. స్కూల్ ద్వారాగాని, రూ.200 అకౌంట్ డిపాజిట్‌ను తపాలా కార్యాలయంలో చేసి ఓ అప్లికేషన్‌ను కవర్లో జతచేసి హిందూపురం, ధర్మవరం తపాలా కార్యాలయాలకు పంపవచ్చన్నారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు రెండు విభాగాల్లో ఉత్తీర్ణత సాధిస్తే ఏడాదికి రూ.6వేలు స్కాలర్‌షిప్ అందుతుందన్నారు. వివరాలకు తపాలా కార్యాలయాలను సంప్రదించాలన్నారు.

మహిళా క్రికెట్ టోర్నీ విజేత చిత్తూరు

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): సీనియర్ మహిళల సౌత్ జోన్ క్రికెట్ టోర్నీ విజేతగా చిత్తూరు జట్టు నిలవగా, ద్వితీయ స్థానంలో అనంతపురం జట్టు నిలిచింది. సోమవారం ఆర్డీటీ స్టేడియంలో ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ సౌత్‌జోన్ సీనియర్ మహిళల క్రికెట్ పోటీలు నిర్వహించారు. అనంతపురం క్రికెట్ గ్రౌండ్‌లో జరిగిన కడప, చిత్తూరు మధ్య జట్ల పోరులో...మొదట బ్యాటింగ్ చేసిన కడప నిర్ణీత ఓవర్లలో 4వికెట్లు కోల్పోయి 101 పరుగులు చేసింది. బ్యాటర్ శిరీషా 50 పరుగులు చేసింది. అనంతరం బరిలోకి దిగిన చిత్తూరు 17.2 ఓవర్లలో వికెట్ నష్టానికి లక్ష్యాన్ని అలవోకగా ఛేదించింది. 9వికెట్ల తేడాతో గెలుపొందిన చిత్తూరు ట్రోఫీని కైవసం చేసుకుంది. శుభశ్రీ 54 పరుగులు, హంస 23 పరుగులు చేశారు. మొదటి స్థానంలో చిత్తూరు, అనంతపురం జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి భీమలింగారెడ్డి చేతుల మీదుగా విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఏసీఏ సెలెక్టర్ ధనలక్ష్మి, జోన్ సెలెక్టర్లు రాధిక, వేదవల్లి, నాగమణి, అనూషా, హరీషా పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయండి

అనంతపురం విద్య, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): ఒంగోలులో ఈ నెల 23 నుంచి నిర్వహిస్తున్న సీపీఐ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని శ్రేణులకు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి నారాయణస్వామి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జాఫర్ పిలుపునిచ్చారు. పార్టీ జిల్లా కార్యాలయంలో సోమవారం మహాసభల పోస్టర్లను విడుదల చేశారు. రాష్ట్ర మహాసభలకు జిల్లా నుంచి 500 మంది జనసేవదళ్ రెడ్‌షర్ట్ వాలంటీర్లు ప్రత్యేకంగా పాల్గొంటున్నారని తెలిపారు. మరో 63 మంది ప్రతినిధులు హాజరవుతున్నారని వివరించారు. దేశంలో ప్రస్తుత పరిస్థితులు దారుణంగా, ప్రమాదకరంగా ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మోదీ ప్రభుత్వం మతోన్మాద అజెండాతో ముందుకు సాగుతోందని, ఇది ప్రజాస్వామ్యానికే ముప్పు అన్నారు. జగన్, చంద్రబాబుకు ప్రజాస్వామ్యం గురించి మాట్లాడే హక్కులేదన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు మల్లికార్జున, రాజారెడ్డి, శ్రీరాములు, కేశవరెడ్డి, లింగమయ్య, పద్మావతి, సంతోష్‌కుమార్, రాజేష్‌కృష్ణుడు, రమణ, రంగయ్య, నాగరాజు, చిరంజీవి, అల్లీపీరా, రాము పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకూ ముఖ హాజరు..!

త్వరలో కొత్త యాప్.. మాన్యువల్ మస్టర్లకు చెల్లు

అంతా.. ఆన్‌లైన్‌లోనే.. అక్రమాలకు చెక్ పడేనా?

కొత్తచెరువు, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో అక్రమాలకు అంతేలేదన్నది బహిరంగ రహస్యమే. గతంలో చేసిన పనులకే మళ్లీ బిల్లులు పెట్టుకుంటారు, పనులకు వెళ్లకున్నా కూలీలను నమోదు చేస్తారు, ఒకరి జాబ్‌కార్డుపై మరొకరు పనులకెళ్లారు.. ఇలా.. ఎన్నెన్నో మాయలు. ఈ అక్రమాలకు చెక్ పెట్టేందుకు కొత్త విధానాన్ని అమలు చేయనున్నారు. ఉపాధి కూలీలకు కూడా ముఖ హాజరు నమోదు చేయనున్నారు. అది కూడా.. పనిచేసే ప్రదేశంలో రెండుపూటలా ముఖ హాజరు వేయనున్నారు. అది కూడా.. లొకేషన్ జియో ట్యాగింగ్ చేస్తారు. దీంతో బోగస్ కూలీలకు చెక్ పెడనుంది. ఆన్‌లైన్ హాజరు మేరకు నేరుగా కూలీల ఖాతాలకు ఉపాధి కూలీ సొమ్ము జమవుతుంది. మాన్యువల్ మస్టర్లు ఉండవన్న మాట. దీంతో మస్టర్లలో ఇష్టారాజ్యానికి చెక్ పెడనుందని డ్వామా వర్గాలు పేర్కొంటున్నాయి. అక్రమాలకు చెక్ పెట్టడమే లక్ష్యమంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్‌ఎంఎంఎస్ (నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టం) యాప్‌ను మరింత పటిష్టం చేయనున్నారు. ఆ దిశగా కూలీల బ్యాంకు ఖాతా వివరాలు సేకరించే పనిలో పడ్డారు. త్వరలోనే యాప్ అమలులోకి రానుందని తెలుస్తోంది.

అమలు ఇలా..

జిల్లాలో మెత్తం 2,78,454 జాబ్ కార్డులు ఉన్నాయి. కొత్త యాప్ అమలులోకి వస్తే.. ఫీల్డ్ అసిస్టెంట్లు తమ స్మార్ట్ ఫోన్లను ఉపయోగించి ఉపాధి పని ప్రారంభం, ముగింపు సమయాల్లో రోజూ కూలీల ముఖ హాజరు నమోదు చేస్తారు. దీంతో మాన్యువల్ అటెండెన్స్‌కు చెక్ పడనుంది. తద్వారా ఉపాధి పనుల్లో అవకతవకలతోపాటు బినామీలకు అరికట్టే అవకాశం ఉంటుంది. ఈ యాప్ అమలు దిశగా ఇప్పటికే కూలీలకు మండల కంప్యూటర్ సెంటర్‌లో ఆధార్ కార్డు ప్రకారం, బ్యాంకు అకౌంట్, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ నమోదు చేస్తున్నారు. ఈ ప్రక్రియ పూర్తవగానే యాప్‌ను అమలులోకి తేనున్నట్లు ఉపాధి పథకం సిబ్బంది తెలియజేస్తున్నారు.

నెట్‌వర్క్ సమస్యగా మారనుందా?

ఎన్‌ఎంఎంఎస్ యాప్ అమలులో నెట్‌వర్క్ సమస్య తలెత్తే అవకాశం ఉందని డ్వామా అధికారులు పేర్కొంటున్నారు. మారుమూల ప్రాంతాల్లో నెట్‌వర్క్ సరిగా లేకపోతే ఈ యాప్ పనిచేయదనీ, దీంతో సిబ్బంది, కూలీలకు ఇబ్బందులు తప్పవని అంటున్నారు.



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

యాప్‌తో అక్రమాలకు చెక్



కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకంలో అక్రమాలను అరికట్టేందుకు ఎన్‌ఎంఎంఎస్ యాప్‌ను త్వరలో అమలు చేయనుంది. మస్టర్లలో బోగస్ కూలీల ఎంట్రీలు తగ్గుతాయి. కొన్ని ప్రాంతాల్లో ఇకరి బదులు మరొకరు పనిచేసుకునే అవకాశాలున్నాయి. వాటికి చెక్ పెట్టేందుకే ఈ యాప్‌ను తీసుకొస్తోంది. జాబ్‌కార్డులో ఎవరు ఉంటే వారే పనికి వెళ్లాల్సి ఉంటుంది.

-విజయేంద్రప్రసాద్, డ్వామా పీడీ

క్రైం కార్నర్

విద్యుదాఘాతంతో యువరైతు మృతి



సందీప్‌రెడ్డి (ఫైల్)

చెన్నేకొత్తపల్లి, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటంపల్లిలో సోమవారం విద్యుదాఘాతానికి గురై ఓ యువరైతు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన రత్నమ్మ, చంద్రారెడ్డి దంపతుల రెండో కుమారుడు మైలారపు సందీప్‌రెడ్డి(36) అనే యువ రైతు తన వ్యవసాయ తోటలో పంటకు నీరు పెట్టడానికి వెళ్లాడు. స్టార్టర్ పెట్టె వద్దకు వెళ్లి మోటారు ఆన్‌చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య మౌనిక, కుమారుడు, కుమార్తె ఉన్నారు. సంఘటనా స్థలం వద్ద విగతజీవిగా పడి ఉన్న సందీప్‌రెడ్డి మృతదేహంపై పడి భార్య మౌనిక, తల్లి రత్నమ్మ రోధించిన తీరు అక్కడున్న వారిని కంట తడి పెట్టించింది. ఘటనతో వెంకటంపల్లిలో విషాదచాయలు అలుముకున్నాయి. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.ట

చేనేత కార్మికుడి ఆత్మహత్య

లేపాక్షి, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో చేనేత కార్మికుడు లక్ష్మీపతి(32) సోమవారం ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్‌ఐ నరేంద్ర తెలిపారు. ఆయన తెలిపిన మేరకు బయన్నపల్లి గ్రామానికి చెందిన ఆదెప్ప కుమారుడు లక్ష్మీపతి గత కొన్నేళ్లుగా లేపాక్షిలో సొంత ఇల్లు నిర్మించుకుని చేనేత కార్మికుడిగా జీవనం సాగిస్తున్నాడు. ఇతడు గత కొన్నేళ్ల నుంచి తీవ్రమైన తలనొప్పితో బాధపడుతుండేవాడు. ఎన్ని ఆసుపత్రుల్లో చూపించినా నయం కాకపోవడంతో తీవ్రంగా మనస్తాపం చెందాడు. ఈక్రమంలోనే జీవితంపై విరక్తి చెంది సోమవారం తెల్లవారుజామున ఇంట్లో భార్య నిద్రిస్తుండగా హాల్‌లో ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నాడు. కాసేపటి తర్వాత నిద్ర లేచిన భార్య ఉరికి వేలాడుతున్న భర్తను చూసి గట్టిగా కేకలు వేసింది. దీంతో చుట్టుపక్కలవారు అక్కడకు వచ్చి ఉరికి వేలాడుతున్న లక్ష్మీపతిని కిందికి దించి పరిశీలించి, మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడికి నాలుగు నెలల కుమార్తె ఉంది. మృతుడి తండ్రి ఆదెప్ప ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

పరిశ్రమలో కార్మికుడి మృతి

హిందూపురం, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): గోళ్లాపురం పారిశ్రామికవాడలోని ఓ స్టీల్ పరిశ్రమలో కార్మికుడు దుర్మరణం చెందాడు. శంభుపాశ్వా(40)అనే కార్మికుడు విధుల్లో ఉండగా సోమవారం ప్రమాదవశాత్తు ఇనుపరాడ్ శరీరంలో దూరింది. వెంటనే అతడిని ఆసుపత్రికి తరలించగా మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. పరిశ్రమ యాజమాన్యం ఈ ప్రమాదంపై గోప్యంగా ఉంచింది. దీనిపై అప్‌గ్రేడ్ సీఐ అంజనేయులును వివరణ కోరగా.. ప్రమాదం జరిగి కార్మికుడు మృతిచెందాడని, దీనిపై దర్యాప్తు చేయాల్సి ఉందన్నారు.

టీచర్ల ఖాళీల వివరాల సేకరణ

అనంతపురం విద్య, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ నియామకాలలో భాగంగా ఖాళీ పోస్టుల వివరాలను విద్యాశాఖ పక్కాగా సేకరిస్తోంది. ఆయా మండలాలు, పాఠశాలలో ఏఏ సబ్జెక్టులు, ఎన్ని పోస్టులు ఖాళీగా ఉన్నాయి, ఇటీవల బదిలీ అయినా రిలీవర్ లేక అదే పాఠశాలలో పనిచేస్తున్న టీచర్లు, ఒక్క టీచర్ లేని పాఠశాలలు, సబ్జెక్టు టీచర్లు లేని ఉన్నత పాఠశాలల సమాచారాన్ని సేకరించింది. వీటి వివరాలను పక్కాగా అందించాలని ఆయా మండలాల ఎంఈఓలు, ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలను ఉదయం అనంతపురం డివిజన్, మధ్యాహ్నం గుత్తి డివిజన్‌ల వారిగా జిల్లా సైన్స్‌సెంటర్‌కు ఆహ్వానించారు. అక్కడ డిప్యూటీ డీఈఓ శ్రీనివాసరావు, ఏఎస్ఓ శ్రీనివాసులు, ఏపీఓ మంజునాథ్, ఐటీ సెల్ చంద్రశేఖరరెడ్డి, రాంప్రసాద్‌రెడ్డి ఎంఈఓలు,హెచ్‌ఎంల నుంచి టీచర్ల ఖాళీల వివరాలను స్వీకరించారు. అక్కడికక్కడే ఆన్‌లైన్‌లో ఖాళీల వివరాలు నమోదు చేయిస్తూ ఉన్న పోస్టులకు.. ఎంఈఓలు, హెచ్‌ఎంలు ఇచ్చిన వివరాలకు సరిపోయాయా లేదా అని పరిశీలిస్తున్నారు. డీఎస్సీ నియామకాలకు ఖాళీల వివాదం తలెత్తకుండా విద్యాశాఖ ముందస్తు చర్యలు తీసుకుంటోంది.

బాధ్యతల స్వీకరణ

అనంతపురం విద్య, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): సమగ్రశిక్ష సూపరింటెండెంట్‌గా కృష్ణారావు బాధ్యతలు స్వీకరించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తున్నారన్న కారణంతో ఇదివరకు ఉన్న సూపరింటెండెంట్ ఇక్బాల్‌మహ్మద్‌ను ఏపీసీ శైలజ ఇటీవల ప్రభుత్వానికి సరెండర్ చేసిన విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో చిత్తూరు జిల్లా సమగ్రశిక్షలో పని చేస్తున్న కృష్ణారావును అనంతపురం జిల్లాకు నియమిస్తూ ఆర్జేడీ శామ్యూల్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన సోమవారం బాధ్యతలు చేపట్టారు. కొత్త సూపరింటెండెంట్‌కు సమగ్రశిక్షలో పనిచేస్తున్న సిబ్బంది అభినందనలు తెలిపారు.

30 మండలాల్లో వర్షం

అనంతపురం అర్బన్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 30 మండలాల్లో ఆదివారం వర్షం కురిసింది. అత్యధికంగా కుందుర్పిలో 19.6 మి.మీ వర్షపాతం నమోదైంది. డి. హిరేహాళ్, తాడిపత్రిలో 15.2, బెళుగుప్ప 13.8, బొమ్మనహాల్ 10.6, రాయదుర్గం 10.2, కంబదూరు 9.2, పెద్దవడుగూరు 8.8, గార్లదిన్నె 8.6, గుత్తి, యాడికి 8.2, కళ్యాణదుర్గం 8.0, శింగనమల 7.2, విడపనకల్లు, యల్లనూరు 6.8, నార్పల 6.4, ఉరవకొండ 6.2, బ్రహ్మసముద్రం 6.0 మి.మీ వర్షపాతం నమోదైంది. మిగతామండలాల్లో 5.6 మి.మీలోపు వర్షపాతం నమోదైంది. సోమవారం జిల్లాలోని పలు ప్రాంతాల్లో వర్షం పడింది. అనంతపురం,యాడికి, పుట్లూరు తదితర మండలాల్లో చిరుజల్లులు పడ్డాయి.

టమోటా కిలో రూ.47

అనంతపురం రూరల్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్లో సోమవారం కిలో టామోటాలు గరిష్ఠంగా రూ.47తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. అదే విధంగా కనిష్ఠ ధర రూ.27తో, సరాసరి ధర రూ.37తో విక్రయాలు జరిగాయన్నారు. మార్కెట్‌కు 2,850 టన్నుల టమోటాలు వచ్చినట్లు పేర్కొన్నారు.

బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహిద్దాం

తాడిపత్రి, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): చింతల వెంకటరమణస్వామి బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహిద్దామని మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి సూచించారు. సోమవారం స్థానిక చింతల వెంకటరమణస్వామి ఆలయంలో కమిటీ సభ్యులు, అర్చకులుతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బ్రహ్మోత్సవాలను సజావుగా నిర్వహించడానికి సూచనలు ఇవ్వాలని కోరారు.

చిత్రం.. సిత్రం..!



ఓ తుంటరి తూనీగా..! నీకే రెక్కలున్నట్లు..!
ఎక్కడెక్కడో తిరిగి.. అలసి ఇక్కడికి వచ్చావు ?
ఎముందని ఎండిన కొమ్మపై వాలావు



రంగు .. రంగు
రెక్కల
సీతాకోక చిలుకా
మకరందపు
మాధుర్యం చూడగ
వచ్చావా..!
మా ఇంటిదాకా..



సూడు సూడు... ఈయప్ప
నేనొగదాన్ని ఉండానని కూడా పట్టించుకోకుండా
సిక్కింది మిడతని గబగబా గొంతులేకి ఏసుకుంటాడు..!



థూ..యాల్రా నాదాంట్లేకి వచ్చిండావు
ఆడ.. యాడా పెట్లేదా బువ్వ.. ఈటికొచ్చినావు
సిత్రాన్నం కమ్మగుంది నేనొగడే తిన్నల్ల.. పోలే అక్కడ

జ్ఞాపకాల దొంతర ఫొటో..
మది చెదిరిన
బాధలు, బంధాలు,
ఆనందాలు, అద్భుతాలు
వినోదాలు, విషాదాలు
గుర్తు చేసే సజీవ సాక్ష్యం ఫొటో
తీపి చేదుల మాధుర్యాన్ని
మనసు పొరలకు అందిస్తూ
కాలగమనాన్ని కాసేపు ఆపే వి'చిత్రం' అది
కాలం మారినా కరిగిపోని వసంతమై
చిగురించిన చైత్రంలా మనసును
బంధించే చిత్తరువు నిత్యనూతనం

నేడు వరల్డ్ ఫొటోగ్రఫీ డే



ఏమన్నా.. ఇన్నాళ్లకు మనుసుకొస్తినా..?
ఓహో. మంగుళారం ఫొటోగ్రఫీ డే కదా..
అందుకే మతికివచ్చుంటా
సరేసర్లే ఫొటో మట్టంగ తియ్.. పిల్ల మామా అనల్ల

స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆంధ్రజ్యోతి.

రోజంతా హై టెన్షన్..

- తాడిపత్రికి బయల్దేరిన పెద్దారెడ్డి
- మధ్యలోనే అడ్డుకున్న పోలీసులు
- వెనక్కి వెళ్లాలని సూచన
- ససేమిరా అన్న మాజీ ఎమ్మెల్యే
- ఆరుగంటల పాటు రోడ్డుపైనే బైఠాయింపు
- ఎట్టకేలకు వెనక్కి పంపించిన పోలీసులు



డీఎస్పీతో పెద్దారెడ్డి వాగ్వాదం

తాడిపత్రి/పుట్లూరు, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): తాడిపత్రి నియోజకవర్గంలో రోజంతా హైటెన్షన్ నడిచింది. తాడిపత్రికి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి సోమవారం బయల్దేరడంతో పట్టణ వాసుల్లో ఆందోళన నెలకొంది. పట్టణంలో ధ్యానశివుడి విగ్రహావిష్కరణకు మున్సిపల్ జేసీ ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో టీడీపీ శ్రేణులు భారీ సంఖ్యలో గుమికూడారు. అదే సమయంలో పెద్దారెడ్డి పట్టణానికి వస్తుండడంతో ఎప్పుడు, ఏం జరుగుతుందోనని సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. దారి మధ్యలోనే పెద్దారెడ్డిని పోలీసులు అడ్డుకోవడంతో ఆయన అక్కడే ఆరుగంటలపాటు బైఠాయించారు. ఎట్టకేలకు సాయంత్రం ఆయనను పోలీసులు వెనక్కి పంపించడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

ఎన్నికల సమయం నుంచి..

గతేడాది ఎన్నికల సమయం నుంచి పెద్దారెడ్డి తాడిపత్రికి దూరంగా ఉంటున్నారు. ఆయనను రానివ్వమని జేసీ ప్రభాకర్ రెడ్డి వర్గీయులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో పెద్దారెడ్డి పలు మార్లు తాడిపత్రికి రావాలని ప్రయత్నించినా.. శాంతిభద్రతల సమస్య తలెత్తుతుందని పోలీసులు అడ్డుకుంటూ వస్తున్నారు. ఈ నేపథ్యంలో పెద్దారెడ్డి.. హైకోర్టును ఆశ్రయించారు. కోర్టు ఆదేశాలతో సోమవారం మరోసారి తాడిపత్రికి వెళ్తున్నట్లు ప్రకటించారు. ఇదేరోజే జేసీ ప్రభాకర్ రెడ్డి పట్టణంలోని అనంతపురం రోడ్డులోని ఫ్లైఓవర్ సమీపాన ధ్యానశివుడి విగ్రహావిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఇందుకు వేలాదిగా టీడీపీ శ్రేణులు, ఆయన అనుచరులు హాజరయ్యారు.



పెద్దారెడ్డి కాన్వాయ్‌ను అడ్డుకున్న పోలీసులు

అడ్డుకున్న పోలీసులు

పెద్దారెడ్డి యల్లనూరు మండలంలోని స్వగ్రామం తిమ్మంపల్లి నుంచి తాడిపత్రికి అనుచరులతో కలిసి బయల్దేరారు. శాంతిభద్రతల సమస్య తలెత్తే అవకాశం ఉందంటూ పుట్లూరు మండలంలోని నారాయణరెడ్డి పల్లి వద్ద పెద్దారెడ్డిని పోలీసులు అడ్డుకున్నారు. శాంతిభద్రతల సమస్య తలెత్తుతుందనీ, తాడిపత్రికి అనుమతించబోమని చెప్పారు. కోర్టు అనుమతితో వెళ్తున్నాననీ, అడ్డుకోవడం ఏమిటంటూ పోలీసులతో పెద్దారెడ్డి వాగ్వాదం చేశాడు. అక్కడే రోడ్డుపై బైఠాయించారు. ఆరుగంటలపాటు అక్కడే ఉన్నారు. సాయంత్రం 6గంటల సమయంలో అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశ్వర్లు తిమ్మంపల్లికి వెళ్లిపోవాలని సూచించారు. దీంతో చేసేదిలేక పెద్దారెడ్డి వెనుదిరిగారు. దీంతో తాడిపత్రి వాసులు, పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు.

కోర్టు ఆర్డర్ ఉన్నా.. అడ్డుకుంటారా..?

మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. పోలీసులే స్వయంగా తనను తాడిపత్రిలోని ఇంటికి చేర్చాలని హైకోర్టు ఆదేశించినా.. వారే అడ్డుకోవడం ఏంటని మండిపడ్డారు. 16నెలలుగా తనను తాడిపత్రికి వెళ్లనీయలేదన్నారు. 'నా ఇంటికి వెళ్లడానికి నేనేమైనా వేరే దేశంలో ఉన్నానా? వీసా ఏమైనా తీసుకోవాలా?' అంటూ పోలీసులను నిలదీశారు. మళ్లీ కోర్టుకు వెళ్తానన్నారు. అడ్డుకున్న అధికారులు, కక్ష సాధిస్తున్న వారిని వదిలిపెట్టమని హెచ్చరించారు. పెద్దారెడ్డిని కలవడానికి వచ్చిన మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్ మాట్లాడుతూ.. తాడిపత్రిలో రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోందన్నారు. మాజీ ఎమ్మెల్యేను తన ఇంటికి వెళ్లనీయకుండా అడ్డుకోవడం ఏంటని ప్రశ్నించారు. ఆయనను పోలీసులు బలవంతంగా జీపులో ఎక్కించి పంపించారు.

అక్రమ మైనింగ్‌పై తనిఖీలు

యాడికి, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని దైవాలమడుగు వద్ద ఒక గనిలో జరుగుతున్న అక్రమ మైనింగ్‌పై సోమవారం కర్నూలు జిల్లాకు చెందిన విజిలెన్స్ అధికారులు తనిఖీ చేశారు. మైనింగ్‌లో జరుగుతున్న అక్రమాలపై నిగ్గు తేల్చడానికి తాడిపత్రి మైన్స్ అండ్ జియాలజీ అధికారులను సంప్రదించినట్లు స్థానికులు చర్చించుకుంటున్నారు. రాయలచెరువు గ్రామానికి చెందిన ఒక పారిశ్రామిక వేత్తకు మండలంలోని దైవాలమడుగు గ్రామం వద్ద డోలమైట్ గని ఉంది. ఇందులో ఖనిజం తవ్వకాలకు సంబంధించి సీఎఫ్‌ఓ, సీఎఫ్‌ఈ కాలపరిమితి ఏడాదిన్నర క్రితం ముగిసినట్లు తెలిసింది. కర్నూలు జిల్లా ఓర్వకల్లు వద్ద విజిలెన్స్ అధికారుల తనిఖీ బయటపడినట్లు తెలిసింది. దీనిపై నిగ్గుతేల్చడానికి సోమవారం కర్నూలు నుంచి విజిలెన్స్ అధికారులు వచ్చారని తెలిసింది. వర్షం పడుతుండడంతో మైనింగ్ ప్రాంతం వద్ద నుంచి అధికారులు వెనక్కి వచ్చినట్లు తెలిసింది.

రాత్రి 12 వరకూ బార్లు

- 1 నుంచి కొత్త బార్ పాలసీ
- ఉమ్మడి జిల్లాలో 30 బార్లకు దరఖాస్తుల ఆహ్వానం
- ఈ నెల 26 వరకు గడువు
- ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డీసీ నాగమద్దయ్య



అనంతపురం క్రైం, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): కొత్త బార్ పాలసీ సెప్టెంబర్ 1వ తేదీ నుంచి అమలవుతుందని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఉమ్మడి అనంతపురం జిల్లా డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య పేర్కొన్నారు. సోమవారం అనంతపురంలోని ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయంలో సూపరింటెండెంట్ రామ్మోహన్‌రెడ్డి, ఇతర అధికారులతో కలసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీ నాగమద్దయ్య మాట్లాడుతూ.. ఏపీ ప్రభుత్వం 2025-2028 సంవత్సరాలకు కొత్త బార్ పాలసీ తీసుకొచ్చిందన్నారు. ఆ మేరకు బార్ల లైసెన్సుల కోసం సోమవారం నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు తెలిపారు. అనంతపురం జిల్లాలో మున్సిపల్ కార్పొరేషన్‌లో 9 బార్లు, గుంతకల్లులో 3, తాడిపత్రిలో 4, రాయదుర్గం, గుత్తి, కళ్యాణదుర్గంలో ఒకటి చొప్పున బార్లు ఉన్నాయని, సత్యసాయి జిల్లాలో హిందూపురంలో 3, ధర్మవరంలో 3, కదిరిలో 3, పెనుకొండ, మడకశిరలో ఒకటి చొప్పున ఉన్నాయని వివరించారు. మొత్తం 30 బార్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. గతంలో బార్లను వేలం పద్ధతిలో కేటాయించే వారని, ప్రస్తుతం లాటరీ డ్రా విధానంలో కేటాయిస్తామని అన్నారు. 2022-25 బార్ పాలసీలో జనాభా స్లాబ్ మేరకు బార్లకు దరఖాస్తు ఫీజు రూ. 5 లక్షలు, రూ.7.5 లక్షలు, రూ. 10 లక్షలు ఉండేదన్నారు. కొత్త విధానంలో దరఖాస్తు ఫీజు అన్నింటికి రూ. 5 లక్షలు, ప్రాసెసింగ్ ఫీజు రూ.10వేలు నిర్ణయించారని తెలిపారు. పారదర్శకంగా ఉండాలన్న ఉద్దేశంతో ప్రతి బార్‌కు కనీసం నాలుగు దరకాస్తులు రావాలన్న షరతును ప్రభుత్వం విధించిందన్నారు. 50 వేలలోపు జనాభా ఉన్న బార్లకు లైసెన్స్ ఫీజు రూ. 35 లక్షలు, 50 వేల నుంచి 5 లక్షల జనాభా ఉన్న బార్లకు రూ. 55 లక్షలు, 5 లక్షల పైబడిన జనాభా ఉన్న బార్లకు రూ. 75 లక్షల ఫీజును ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. గతంలో ఉన్న ఫీజులతో పోలిస్తే భారీగా తగ్గించారని అన్నారు. కొత్త బార్ల నిర్వహణ సమయాన్ని కూడా పెంచారన్నారు. ఉదయం 10 గంటల నుంచి రాత్రి 12 గంటల వరకూ నడపవచ్చు అన్నారు. లైసెన్సు ఫీజును ఆరు వాయిదాల్లో చెల్లించవచ్చునని తెలిపారు. గతంలో ముందే రెస్టారెంట్ తప్పనిసరిగా ఉండాలనే నిబంధన ఉండేదని, కొత్త విధానంలో లైసెన్సు వచ్చిన 15 రోజుల వరకు గడువు ఉంటుందని స్పష్టం చేశారు. ఈ నెల 26వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తులను ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్లలో వేయవచ్చు అన్నారు. దరఖాస్తులను రెండు జిల్లాల్లోని ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయాల్లో అందజేయాలన్నారు. 28వ తేదీ లాటరీ డ్రా ఉంటుందన్నారు. కార్యక్రమంలో అనంతపురం సీఐ సత్యనారాయణ, ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.



నీటితో కళకళలాడుతున్న పీఏబీఆర్ డ్యాం

పీఏబీఆర్‌కు జలకళ

- డ్యాంలో నాలుగు టీఎంసీల నిల్వ

కూడేరు, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): పెన్నహోబిళం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (పీఏబీఆర్ డ్యాం) నీటితో కళకళలాడుతుంది. ప్రస్తుతం డ్యాంలో నాలుగు టీఎంసీల నీటి నిల్వ ఉంది. డ్యాంలో నీటి మట్టం గేట్ల వద్దకు చేరడంతో ఇరిగేషన్ ఎస్ఈ సుధాకర్, డీఈ వెంకటరమణ సోమవారం పరిశీలించారు. జీడిపల్లి రిజర్వాయర్ నుంచి పీఏబీఆర్ డ్యాంలోకి 1672 క్యూసెక్కుల ఇన్ ఫ్లో ఉందని డీఈ వెంకటరమణ తెలి పారు. జీడిపల్లి రిజర్వాయర్ నుంచి హంద్రీనీవా ఫేజ్-2 కాలువకు అధికారులు నీరు వదలడంతో, పీఏబీఆర్ డ్యాంకు వస్తున్న నీరు తగ్గిముఖం పట్టింది. గతంతో 1860 క్యూసెక్కుల నీరు వస్తుండగా, సోమవారం 1672 క్యూసెక్కులకు తగ్గింది. మరో వారం రోజులకు పూర్తిగా తగ్గిపోతుందని అధికారుల ద్వారా తెలిసింది. జీడిపల్లి రిజర్వాయర్ నుంచి నీరు తగ్గిపోతే తుంగభద్ర డ్యాం నుంచి వస్తున్న నీటిని లింక్ చానల్ ద్వారా పీఏబీఆర్ డ్యాంలోకి మళ్లించి ఐదు టీఎంసీలు నిల్వ చేయడానికి అధికారులు కసరత్తు చేస్తున్నారు.

ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌లో పోలీసుల తనిఖీ



డాగ్ స్క్వాడ్‌తో పోలీసులు

అనంతపురం క్రైం, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): డ్రగ్స్, మత్తుపదార్థాల రవాణా నియంత్రణ కోసం పోలీసులు ప్రశాంతి ఎక్స్‌ప్రెస్(18463) రైలులో సోమవారం తనిఖీలు నిర్వహించారు. జీఆర్పీ, ఆర్పీఎఫ్, స్థానిక పోలీసులు, డాగ్ స్క్వాడ్, ఈగల్ సెల్ పోలీసులు తనిఖీ చేశారు. అనంతపురం నుంచి ధర్మవరం వరకూ ప్రయాణిస్తున్న వారి లగేజీ, టికెట్లు పరిశీలించారు. అనుమానాస్పదంగా కనిపించే ప్రయాణికుల వివరాలు అడిగి తెలుసుకుని, లగేజీని తనిఖీ చేశారు. డ్రగ్స్, గంజాయి ఇతర మత్తు పదార్థాలను రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఈగల్ సెల్ ఎస్‌ఐ హనుమంతు, జీఆర్పీ ఎస్‌ఐ వెంకటేశ్వర్లు, ఆర్పీఎఫ్ సీఐ సుధాకర్‌రావు, డాగ్ స్క్వాడ్ చాంద్ బాషా పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు విరాళం



నగదును అందిస్తున్న పరిటాల సునీత, శ్రీరామ్

రాప్తాడు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బండమీదపల్లి గ్రామంలో బీఆర్ అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు ఎమ్మెల్యే పరిటాల సునీత, టీడీపీ ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ రూ.1.30 లక్షలను విరాళంగా అందజేశారు. రామగిరి మండలం వెంకటాపురంలో గల తమ నివాసంలో సోమవారం వారు బండమీదపల్లి గ్రామస్థులకు మాజీ సర్పంచ్ దగ్గుపాటి శ్రీనివాసులు ఆధ్వర్యంలో నగదును అందజేశారు.

ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏ రెన్యువల్ చేయాలి



ధర్నా చేస్తున్న ఆర్డీటీ అభిమాన సంఘం నాయకులు

అనంతపురంరూరల్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి అనంతజిల్లాలో పేదలకు అనేక సేవలు అందిస్తున్న ఆర్డీటీకి కేంద్ర ప్రభుత్వం ఎఫ్‌సీఆర్ఏను రెన్యువల్ చేయాలని ఆర్డీటీ అభిమాన సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం అనంతపురం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. కార్యక్రమంలో సంఘం నాయకులు రాచానపల్లి సుబ్రమణ్యం, చిన్నకుంట నారాయణ, ఎన్.ఎన్.కుంట తిరుపాలు, రామాంజనేయులు, పెద్దక్క, మన్నీల గోపాల్, తేజ, వెంకటరాముడు, నల్లప్ప, భీమన్న, శ్రీరాములు, తనుజా, జ్యోతి, డేవిడ్, సుష్మ పాల్గొన్నారు.

ఫర్టిలైజర్ దుకాణాల తనిఖీ

గార్లదిన్నె, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్లూరులో గల ఫర్టిలైజర్ షాపులను అనంతపురం ఏడీఏ అల్తాఫ్ అలీఖాన్ సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అక్కడి రికార్డులను, ఈపాసులను పరిశీలించారు. అనంతరం గోడౌన్‌లో స్టాక్‌ను పరిశీలించారు. ఓ షాపులో ఈ పాసులో ఉన్న స్టాక్‌కు గోడౌన్‌లోని స్టాక్‌లో 200 బ్యాగులకు రికార్డు సక్రమంగా లేకపోవడంతో షాపు నిర్వాహకులకు షోకాజ్ నోటీసులు ఇచ్చారు. అనంతరం మాట్లాడుతూ... రైతులకు నాణ్యమైన ఎరువులు అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఓ సాయిలక్ష్మి, ఏఈఓ హరిత తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో మీ సమస్య-మా బాధ్యత

న్యూస్‌నెట్‌వర్క్, ఆంధ్రజ్యోతి: రాప్తాడు మండలంలోని పాలచెర్ల, బోగినేపల్లి, కనగానపల్లి మండలంలోని ముత్తవకుంట్ల, అనంతపురం రూరల్ మండలంలోని కందుకూరు, ఆలమూరు గ్రామాల్లో టీడీపీ నాయకులు సోమవారం మీ సమస్య-మాబాధ్యతను నిర్వహించారు. ఇందులో ఆయా గ్రామస్థులు పలు సమస్యలకు పరిష్కారం కోరుతూ వారికి వినతిపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఆయా మండలాల పార్టీ కన్వీనర్లు, ప్రధానకార్యదర్శులు, సింగిల్‌విండో చైర్మన్లు, నాయకులు పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతులు చేయాలని వినతి

గార్లదిన్నె, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రం నుంచి మర్తాడు మీదుగా కోటంకకు వెళ్లే రోడ్డుకు మరమ్మతులు చేయాలని టీడీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆవుల క్రిష్ణయ్య కోరారు. ఈ మేరకు సోమవారం మర్తాడు గ్రామస్థులతో కలిసి మండలకేంద్రంలోని ఎంపీడీఓ యోగానందరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మర్తాడు మీదుగా కోటంకకు వెళ్లే రోడ్డు తీవ్ర గుంతలమయంగా ఉందని, ప్రయాణించాలంటే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వర్షాలు వస్తే పరిస్థితి మరింత దారుణంగా ఉంటోందన్నారు. అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయించాలని కోరారు. తర్వాత పంచాయతీ రాజ్ ఏఈ శ్రీనివాసులకు కూడా వినతిపత్రం అందించారు. గ్రామస్థులు పాండు, గోరకాటి వెంకటేసు, ఆవుల శ్రీనివాసులు, తాతయ్య, బీరే సుబ్బన్న, వెంకట్రాముడు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

చెన్నేకొత్తపల్లి, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని జాతీయ రహదారి జంక్షన్ వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. రామగిరి మండల కలికివాండ్ల పల్లికి చెందిన గోవిందరెడ్డి, ధర్మవరం మండలం ముచ్చురామికి చెందిన రామంజి ఎన్ఎస్‌గేటు నుంచి బైక్‌లో చెన్నేకొత్తపల్లికి వస్తున్నారు. జాతీయ రహదారి జంక్షన్ వద్దకు రాగానే అనంతపురం వైపునకు వెళ్తున్న కారు ఢీకొంది. ప్రమాదంలో వారిద్దరికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు వెంటనే స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

విద్యుత్ స్తంభంపై నుంచి పడి ఒకరికి..

గార్లదిన్నె, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని సంజీవపురం గ్రామ సమీపంలో విద్యుత్ స్తంభం మీద నుంచి పడి ఒకరికి గాయాలయ్యాయి. కొప్పలకొండకు చెందిన సుధాకర్ సంజీవపురం సమీపంలో విద్యుత్ స్తంభం ఎక్కి ఇనుము సామాగ్రిని తీస్తుండగా స్తంభం విరిగిపోయింది. దీంతో సుధాకర్ కిందకు పడి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే గార్లదిన్నె ఆస్పత్రిలో చేర్పించారు. తర్వాత అక్కడి నుంచి అనంతపురం తరలించారు.

భూములు ఆన్‌లైన్ చేయాలని నిరసన

శింగనమల, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): తమకు సంబంధించిన పట్టా భూములు తమ పేర్లు మీద లేవని, గత మూడేళ్లగా రెవెన్యూ అధికారులు చుట్టూ తిరుగుతున్నా.. మాపేర్ల మీద భూమి వివరాలు ఆన్‌లైన్లో నమోదు చేయలేదని మండలంలోని ఆనందరావుపేట గ్రామానికి చెందిన 12 మంది రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ఆనందరావుపేట గ్రామ రెవెన్యూ పొలం 97-1బీ సర్వేనంబర్‌లో తమకు ల్యాండ్ సీలింగ్ భూముల కింద పట్టాలు ఇచ్చారని, అందుకు సంబంధించి పట్టా పాసుపుస్తకాలు కూడా ఇచ్చారని తెలిపారు. అయితే మూడేళ్ల క్రితం అధికారులు తమ 12 మంది వివరాలు ఆన్‌లైన్ నుంచి తొలగించారని వాపోయారు. తమ భూ పట్టాలు జెన్యూన్‌గా ఉన్నా ఎందుకు తొలగించారో అర్థం కావడం లేదన్నారు. ఆన్‌లైన్ చేయాలని రెవెన్యూ, ఆర్డీఓ, కలెక్టర్ దృష్టికి తీసుకుపోయినా ఇంతవరకు న్యాయం జరగలేదన్నారు. ఇప్పటికైనా స్పందించాలని కోరారు. తహసీల్దార్ శేషారెడ్డి రైతులతో చర్చించి సమస్య పరిష్కారం చేస్తామని తెలపడంతో నిరసన విరమించారు.

స్త్రీ శక్తి అమలుపై సంబరాలు

చెన్నేకొత్తపల్లి, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం స్త్రీశక్తి పథకాన్ని అమలు చేయడంపట్ల హర్షం వ్యక్తం చేస్తూ మండలంలోని న్యామద్దల గ్రామంలో డ్వాక్రామహిళలు, టీడీపీ నాయకులు సోమవారం సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, ఎమ్మెల్యే పరిటాలసునీత చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. తెలుగు మహిళ విజయమ్మ, డ్వాక్రా మహిళలు భాగ్యలక్ష్మి, శాంతి, శిరీష, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



సీఎం, డిప్యూటీ సీఎం, ఎమ్మెల్యే చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం

మట్టి వినాయకుడిని పూజించాలి

● కలెక్టర్ వినోద్‌కుమార్ సూచన



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ తదితరులు

అనంతపురం కలెక్టరేట్/టౌన్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): త్వరలో జరిగే వినాయక చతుర్థికి మట్టి వినాయకుడిని పూజించి పర్యావరణాన్ని పరిరక్షించాలని కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ ప్రజలకు సూచించారు. కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో సోమవారం ఏపీ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా పర్యావరణ అనుకూల వినాయ క చవితి అవగాహన కార్యక్రమంలో భాగంగా సహజ వనరులతో చేసిన మట్టి ప్రతిమలతో పర్యావరణ అనుకూల వినాయక చవితిని జరుపుకుందాం అనే కరపత్రాలను కలెక్టర్ ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ... వినాయక చవితి విశిష్టతను కాపాడుకునేందుకు అందరూ సమష్టిగా కృషి చేయాలన్నారు. మట్టి ప్రతిమలతో వినాయక చవితిని జరుపుకోవాలన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను వినియోగం చకూడదని తెలిపారు. చెరువులు, జలవనరులకు నష్టం కలిగించే వ్యర్థ పదార్థాల వినియోగాన్ని పూర్తిగా మానేయాలన్నారు. మట్టితో చేసిన ప్రతిమలను మాత్రమే వాడాలని, విగ్రహాల తయారీకి సహజసిద్ధమైన రంగులను ప్రకృతిలో లభ్యమయ్యే పత్తి, నార వంటి పదార్థాలను వినియోగించాలని సూచించారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్(పీఓపీ) విగ్రహాల వాడకం నిషేధమని, ప్రతిఒక్కరూ గ్రహించాలని అన్నారు. సుప్రీంకోర్టు, నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాలకు అనుగుణంగా విగ్రహాల తయారీ, నిమజ్జన కార్యక్రమం జరగాలన్నారు. వినాయక మండపాలు, విగ్రహాల ఏర్పాటు సమయాల్లో రెవెన్యూశాఖ, నగరపాలక సంస్థ, జిల్లా పంచాయతీశాఖ, అగ్నిమాపకశాఖ, పోలీసుశాఖ, కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి జారీ చేసిన మార్గదర్శకాలను అనుసరించాలని సూచించారు. కార్యక్రమంలో జేసీ శివనారాయణశర్మ, డీఆర్ఓ మలోలతో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

దివ్యాంగుల సమస్యలపై కలెక్టర్‌కు వినతి

అనంతపురం కలెక్టరేట్: జిల్లాలో దివ్యాంగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని దివ్యాంగుల హక్కుల పోరాట సమితి నాయకులు కోరారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో ఆందోళన నిర్వహించి అనంతరం కలెక్టర్ వినోద్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. పోరాట సమితి ఉమ్మడి జిల్లాల కోఆర్డినేటర్ హరినాథరెడ్డి, జిల్లా అధ్యక్షుడు వసంత్‌కుమార్, కార్యదర్శి రామయ తదితరులు పాల్గొన్నారు.

'డబుల్ సూట్ విధానాన్ని రద్దు చేయాలి'

గార్లదిన్నె, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి) : చీనీ కొనుగో లు చేసే వ్యాపారుల నుంచి డబుల్ సూట్ విధానాన్ని రద్దు చేయాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, అధ్యక్షుడు తరిమెల నాగరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలకేంద్రంలో సోమవారం జరిగిన రైతు సంఘం 7వ మండల మహా సభకు వారు ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడారు. రైతుల నుంచి చీనీకాయలను వ్యాపారులు డబుల్ సూట్‌తో కొనుగోలు చేస్తున్నారన్నారు. ఈ డబుల్ సూట్ వల్ల రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారన్నారు. డబుల్ సూట్ చేయరాదని ప్రభుత్వాలు చెప్పినప్పటికీ వ్యాపారులు వినడం లేదన్నారు. ఇప్పటికైనా డబుల్‌సూట్ లేకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని అన్నారు. అలాగే చీనీ మార్కెట్‌లో కమీషన్ విధానాన్ని కూడా రద్దు చేయాలని వా రు కోరారు.

రైతు సంఘం కమిటీ ఎంపిక :



రవితేజారెడ్డి



ఇల్లూరు వలి.

రైతు సంఘం మండల నూతన క మి టీ ని ఎంపిక చేశారు. అధ్యక్షుడిగా కోటంకకు చెందిన రవితేజారెడ్డిని, కార్యదర్శిగా మర్తాడుకు చెందిన ఇల్లూరు వలిని ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. అదేవిధంగా పలువురిని ఉపాధ్యక్షులుగా, సభ్యులుగా ఎంపిక చేశారు.

'దరఖాస్తులు తీసుకోండి సారూ..'

శింగనమల, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): ఇటీవల పూర్తయిన సదరం క్యాంపులో సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌లో కొందరు దివ్యాంగులు పింఛన్‌కు అనర్హులుగా తేలింది. అయితే వారికి మళ్లీ వెరిఫికేషన్ ఉంటుందని, అందుకు నోటీసులు జారీ చేస్తామని, ఆ నోటీసులతో పాటు పాత సదరం సర్టిఫికెట్లతో నెలరోజుల్లోగా మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని అధికారులు తెలిపారు. ఈ క్రమంలో మండలంలోని రాచేపల్లి కొరివిపల్లి, తరిమెల సచివాయంలో తిరస్కరణగురైన వికలాంగ పింఛన్‌దారులకు సోమవారం నోటీస్‌లు ఇచ్చారు. వాటిని తీసుకున్న దివ్యాంగులు వెంటనే శింగనమల కమ్యూనిటీ ఆస్పత్రికి,ఎంపీడీఓ కార్యాలయం వద్దకు చేరుకుని దరఖాస్తులు తీసుకోండి సారూ అంటూ అధికారులకు మొరపెట్టుకున్నారు. అయితే ఎక్కడ దరఖాస్తులు చేసుకోవాలనేది స్పష్టం కాకపోవడంతో అధికారులు తలలు బాదుకున్నారు. ప్రభుత్వం నుంచి స్పష్టమైన సమాచారం వస్తేనే దరఖాస్తులు తీసుకుంటామని, అంతవరకు వేచి ఉండాలని అధికారులు తెలపడంతో దివ్యాంగులు వెనక్కు వెళ్లిపోయారు.

30న విజయవాడలో భారీ సభ



కరపత్రాలను విడుదల చేస్తున్న బీజేపీ నాయకులు

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): సంచార-అర్థ సంచార జాతుల విముక్త దినోత్సవం సందర్భంగా ఈనెల 30వ తేదీన విజయవాడలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ఆధ్వర్యంలో స్ఫూర్తి పేరిట భారీ సభను నిర్వహించనున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కొనకొండ్ల రాజేష్ తెలిపారు. ఈ సభకు సంబంధించిన కరపత్రాలను నగరంలోని ఆర్అండ్‌బీ అతిథిగృహంలో సోమవారం ఆయన విడుదల చేశారు. అ నంతరం మాట్లాడుతూ ఈ నెల 30వ తేదీన భారీ సభలో సంచార కులాల వృత్తులను, కళలను ప్రదర్శించడం, శోభాయాత్రతో పాటు కళాకారులకు, ఉద్యమ నాయకులకు అవార్డు గ్రహీతలకు సత్కారాలు చేయడం వంటివి ఉంటాయన్నారు. సంచారసమాజం ఎదుర్కొంటున్న సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే దిశగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ నేతృత్వంలో జరిగే స్ఫూర్తి సభకు అధికసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు చిరంజీవిరెడ్డి, రత్నమయ్య, వెంకటేశ్వరరెడ్డి, లలిత్‌కుమార్, అల్లాడి రామచంద్రయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శులు అశోక్‌రెడ్డి, ఆంజనేయులు, జిల్లా కార్యదర్శి పోగుల నాగేంద్ర, ఉపాధ్యక్షుడు ఈశ్వర్, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు నాగేంద్ర, ఎస్టీ మోర్చా రంజిత్‌నాయక్, ఎస్సీ మోర్చా మలోబులు తదితరులు పాల్గొన్నారు.

తపోవనంలో బ్రిడ్జి నిర్మించాల్సిందే: సీపీఎం

అనంతపురం టౌన్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): నగరంలో తిక్కరంగయ్య స్వామి ఆలయం నుంచి తపోవనం వరకు రోడ్డును మరమ్మతులు చేయడంతో పాటు వంక వద్ద బ్రిడ్జిని నిర్మించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి నల్లప్ప డిమాండ్ చేశారు. ఈ మేరకు సీపీఎం నాయకులు సోమవారం బ్రిడ్జి వద్ద రిలే నిరాహార దీక్షను ప్రారంభించారు. ఈ సందర్భంగా నల్లప్ప మాట్లాడుతూ... తిక్కరంగయ్యస్వామి ఆలయం నుంచి తపోవనం వెళ్లే దారి పూర్తిగా గుంతలమయంగా ఉందని, ఇక్కడ ప్రయాణం చేయాలంటే వాహనదారులకు నరకం కనపడుతోందని అన్నారు. అలాగే నడిమివంకకు సైడ్‌వాల్‌ల నిర్మాణం పూర్తి కాకపోవడంతో స్థానికంగా నివశిస్తున్న ప్రజలు వర్షాకాలమంతా భయభ్రాంతులకు గురి కావాల్సివస్తోందని తెలిపారు. పాలకులు ఆ సమస్యల్ని పరిష్కరించాలన్నారు. లేకపోతే అన్ని పార్టీలను కలుపుకుని పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. సీపీఎం నాయకుడు రాజు అధ్యక్షతన నిర్వహించిన ఈ రిలే దీక్షలో నగర కార్యదర్శి రామిరెడ్డి, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకుడు నాగరాజు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ జయచంద్రనాయుడు, వైసీపీ నాయకులు రామచంద్ర, రంగంపేట గోపాల్‌రెడ్డి, నిమ్మల నాగరాజు, టీడీపీ నాయకుడు శంకర్, తపోవనం రాజు, కాంట్రాక్టర్ రామ్మోహన్, సీపీఎం నగర కమిటీ సభ్యులు వెంకటనారాయణ, ప్రకాష్, ఇర్ఫాన్, మసూద్, వలి, వరలక్ష్మి, సునీత తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతులను ఆదుకోవాలని వినతి

అనంతపురం విద్య ఆగస్టు18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సంక్షోభంలో ఉన్న కౌలు రైతులను ఆదుకోవాలని కౌలురైతుసంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం నగరంలోని జిల్లా కార్యాలయంలో ఎల్‌డీఎంను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం పలువురు మాట్లాడుతూ కౌలురైతులందరికీ గుర్తింపుకార్డులు జారీచేయాలని, రిజర్వ్‌బ్యాంకు నిబంధనల మేరకు పంటరుణాలు అందించాలని, ఉచితపంటల బీమాపథకాన్ని వర్తింపజేయాలని, సాగుదారులైన కౌలురైతులకు అన్నదాత సుఖీభవ అందించాలని విన్నవించారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామక్రిష్ణ, నాయకులు రాము, బాషా, రామాంజనేయులు, తిరుపతయ్య, శ్రీనివాసులు, ఈశ్వరయ్య, తాతయ్య, శివ, గంగాధర పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

అనంతపురం క్రైం, ఆగస్టు18(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఆదర్శ కాలనీలో నివాసం ఉంటున్న ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. 4వ పట్టణ పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. తాడిమర్రి మండలం చిల్లవాండ్లపల్లికి చెందిన ప్రకాష్ నాయుడు(22) బీటెక్ చదివాడు. నగరంలోని ఆదర్శ కాలనీలో నివాసం ఉంటూ కేఎస్ఎన్ కళాశాల వద్ద ఫాస్ట్ ఫుడ్ సెంటర్ నిర్వహిస్తున్నాడు. అయితే బీటెక్ చదివినా..ఉద్యోగం రాలేదని కొంతకాలంగా బాధపడుతుండేవాడు. ఈక్రమంలో తీవ్రమనస్తాపం చెందిన అతను సోమవార తెల్లవారుజామున గది బయట వరండాలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

భార్యపై కత్తితో దాడి.. కేసు నమోదు


అనంతపురం క్రైం, ఆగస్టు18 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని ఓబులదేవ నగర్‌లో ఉంటున్న భాగ్య బాయిపై ఆమె భర్త కత్తితో దాడి చేశాడు. ఈ ఘటనపై 2వ పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. భాగ్యశ్రీ బాయి, రవినాయక్ దంపతులు. రవి నాయక్ ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. కాగా అతడు తరుచూ తాగి వచ్చి గొడవపడుతుండటంతో ఆమె తన కొడుకు, కూతురుతో మరోచోట వేరుగా ఉంటోంది. ఈ క్రమంలో ఇద్దరి మధ్య మనస్పర్థలు పెరగాయి. భర్త ఆమెపై మరింత కోపం పెంచుకున్నాడు. దీంతో సోమవారం ఇంట్లోకి వెళ్లి భాగ్యబాయి మెడపై కత్తితో దాడి చేశాడు. ఆమె కేకలు వేయడంతో వెంటనే స్థానికులు వచ్చి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అయ్యప్పస్వామి ఆలయ కమిటీని ప్రక్షాళన చేయాలి

అనంతపురం టౌన్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని చెరువుకట్ట అయ్యప్పస్వామి ఆలయ కమిటీని ప్రక్షాళన చేయాలని శ్రీ సాయి అయ్యప్ప సేవాసమాజం నాయకులు కోరారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో జేసీ శివనారాయణ శర్మను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... 30 ఏళ్లుగా ఆలయ కమిటీకి సంబంధించి ఒకే కుటుంబానికి చెందిన వ్యక్తులు అధ్యక్షులుగా కొనసాగుతున్నారన్నారు. ఈ విధానాన్ని ప్రక్షాళన చేయాలని అనేకమార్లు విన్నవించినా ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా స్పందించి కమిటీ ప్రక్షాళన చేపట్టి, అధ్యక్షుడుగా మరొకరికి అవకాశం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సేవా సమాజం ఉపాధ్యక్షుడు గజేంద్రమోహన్, ప్రధాన కార్యదర్శి నాగలింగారెడ్డి, ఉపకార్యదర్శి కేశవ, గురుస్వామి రంగాచారి తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం లాభదాయకం

● కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ అడిషనల్ సెక్రటరీ, ఐఏఎస్ అనిల్‌కుమార్



కొత్తపల్లిలో డ్రాగన్ ఫ్రూట్ పొలం వద్ద అనిల్‌కుమార్ తదితరులు

రాప్తాడు, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయం లాభదాయకమని కేంద్ర గ్రామీణాభివృద్ధి సంస్థ అడిషనల్ సెక్రటరీ, ఐఏఎస్ అనిల్ కుమార్ తెలిపారు. మండలంలోని కొత్తపల్లి గ్రామంలో సోమవారం ఆయన పర్యటించారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగు చేస్తున్న వివిధ రకాల పంటలను రైతులు, అధికారులతో కలిసి పరిశీలించారు. మహిళా రైతు లక్ష్మీదేవి 18 సెంట్ల స్థలంలో సాగు చేసిన 22 రకాల ఆకు కూరలు, కూరగాయలను, మరో మహిళా రైతు 4 ఎకరాల్లో సాగు చేసిన డ్రాగన్ ఫ్రూట్ పంటను పరిశీలించారు. అనంతరం గ్రామంలోని మహిళా సంఘం, రైతు మహిళా సంఘం సభ్యులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. గ్రామంలో ఎంత మంది రైతులు ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారో ఆరా తీశారు. ప్రకృతి వ్యవసాయం వల్ల ఎన్నోలాభాలు, ఉన్నాయని తెలిపారు. ప్రస్తుతం ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయం సాగు వైపు దృష్టి సారిస్తోందని, ఊరూరా ప్రకృతి వ్యవసాయం సాగు చేసేలా చర్యలు తీసుకుంటోందని అన్నారు. కార్యక్రమంలో జాతీయ జీవనోపాదుల మిషన్ రాష్ట్ర యాంకర్ పర్సన్ బిబు సంతోష్‌కుమార్, ట్రైనీ కలెక్టర్ సచిన్‌రాహర్, అడిషనల్ సీఈఓ సెర్ప్ శ్రీరాములు నాయుడు, స్త్రీనిధి మేనేజింగ్ డైరెక్టర్ హరిప్రసాద్, డీఆర్‌డీఏ పీడీ శైలజ, మండల స్థాయి అధికారులు, రైతులు పాల్గొన్నారు.

●బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని చైతన్య మండల సమాఖ్య కార్యాలయాన్ని అనిల్‌కుమార్ సందర్శించారు. ఈ సందర్భంగా డ్వాక్రా సంఘాల ద్వారా రుణాలు తీసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందిన వారి వివరాలను, రుణాలతో ఏర్పాటు చేసిన పరిశ్రమల వివరాలను తెలుసుకుని ప్రశంసించారు. రానున్న కాలంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మరిన్ని సంక్షేమ పథకాలనుఇస్తాయని , వినియోగించుకోవాలని సూచించారు.

●అనంతపురం రూరల్:మండలంలోని ఆకుతోటపల్లి సమీపంలోని రూడ్‌సెట్‌ను కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ సభ్యులు సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ శిక్షణ పొందుతున్న సీఆర్‌పీలతో ఎంఓఆర్డీ అడిషనల్ సెక్రటరీ అనిల్ కుమార్ మాట్లాడి శిక్షణపై పలు అంశాలనడిగి తెలుసుకున్నారు.

వినాయక మండపం ఏర్పాటుకు భూమిపూజ



భూమిపూజ చేస్తున్న మేయర్, డిప్యూటీ మేయర్లు తదితరులు

అనంతపురం టౌన్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట వినాయక చవితి ఉత్సవ మండపం ఏర్పాటుకు సోమవారం భూమిపూజ నిర్వహించారు. జిల్లా గణేశ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో 43వ వార్షికోత్సవం సందర్భంగా ఈనెల 27 నుంచి 31వ తేదీ వరకు వినాయక చవితి ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో ఏర్పాటు చేసిన భూమిపూజ కార్యక్రమానికి నగరపాలకసంస్థ మేయర్ మహ్మద్ వశీం సలీం, డిప్యూటీ మేయర్లు వాసంతి సాహిత్య, కోగటం విజయభాస్కర్‌రెడ్డిలు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. రుత్వికుల వేదమంత్రోచ్చారణల నడుమ ప్రత్యేక పూజలతో భూమిపూజల చేశారు. కార్యక్రమంలో ఉత్సవ సమితి ప్రతినిధులు పరుచూరు రమేష్, ప్రమోద్‌స్వామి, లలిత్‌కుమార్, బాంబేడైయింగ్ నాగన్న, ఓలేటి రత్నమయ్య తదితరులు పాల్గొన్నారు.

స్వమిత్వ సర్వేపై నిర్లక్ష్యం తగదు: డీపీఓ



హంపాపురంలో సిబ్బందికి సూచనలు చేస్తున్న డీపీఓ నాగరాజనాయుడు

అనంతపురం న్యూటౌన్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి) స్వమిత్వ సర్వేపై నిర్లక్ష్యం తగదని, డిమాండ్ నోటీసుల జనరేషన్ వేగవంతం చేయాలని డీపీఓ నాగరాజ నాయుడు పంచాయతీ సెక్రటరీలను ఆదేశించారు. స్థానిక డీపీఓ కార్యాలయంలో సోమవారం సాయంత్రం ఆయన స్వమిత్వ జిల్లా కో - ఆర్డినేటర్, ఏఓ సోమశేఖర్, ఇతర సిబ్బందితో కలిసి జిల్లాలో సమిత్వ సర్వేలో వెనకబడ్డ పంచాయతీల సెక్రటరీలతో జూమ్‌కాల్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ప్రతి రోజు 50 నివాసాలు స్వమిత్వ సర్వే పూర్తి చేయాలని ఆదేశించామని, ఎప్పటికి పూర్తి చేస్తారని నిలదీశారు. విలైనంత త్వరగా ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. దీంతో డిమాండ్ నోటీసులు జనరేట్ చేసే పన్ను వసూళ్లకు అనువుగా ఉంటుందని తెలిపారు.

అనంతపురం న్యూటౌన్: రాప్తాడు మండలంలోని హంపాపురం పంచాయతీలో జరిగే స్వమిత్వ సర్వేను డీపీఓ తనికీ చేశారు. అందులో భాగంగా స్థానిక సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎక్కడ ఎలాంటి లోపాలకు తావులేకుండా చూడాలని ఆదేశించారు.

అనంతేశ్వర స్వామికి విశేష పూజలు



ప్రత్యేక అలంకరణలో అనంతేశ్వరస్వామి

అనంతపురం టౌన్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): శ్రావణమాసం చివరి సోమవారాన్ని పురస్కారించుకుని శివాలయాల్లో ప్రత్యేక పూజలు ఘనంగా జరిగాయి. ఈ నేపథ్యంలో శారదానగర్‌లోని శివబాలయోగి ఆశ్రమంలో అనంతేశ్వర స్వామికి అర్చకులు ఫలపంచామృతాభిషేకాలు చేయడంతోపాటు ప్రత్యేక అలంకరణలు, విశేష పూజలు జరిపారు. మహా మంగళహారతి నివేదనానంతరం భక్తులకు తీర్థప్రసాద వితరణలు చేశారు.

పారిశుధ్య నిర్వహణ మెరుగుపరచాలి

● ఏఎంసీలోని పీజీఆర్ఎస్‌లో నగరవాసుల వినతి



వినతులు స్వీకరిస్తున్న ఏఎంసీ కమిషనర్, ఎస్ఈ

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థలో పారిశుధ్య నిర్వహణ అధ్వానంగా ఉందని.. మెరుగు పరచాలని నగరవాసులు కోరారు. ఈ మేరకు స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ఎస్ఈ రాజశేఖర్, కమిషనర్ బాలస్వామికి వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో వివిధ సమస్యల పరిష్కారం కోరుతూ నగర ప్రజలు మొత్తం 12 వినతులను అధి కారులకు అందజేశారు. అందులో పారిశుధ్యం మెరుగుపరచాలనే వినతులు అధికంగా ఉన్నాయి.

పీవీకేకేలో ముగిసిన వర్క్‌షాపు



వర్క్ షాపును ప్రొజెక్టర్ ద్వారా వీక్షిస్తున్న విద్యార్థులు

అనంతపురం రూరల్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): ఆలమూరురోడ్డులో గల పీవీకేకే కళాశాలలో గత వారంరోజులుగా సెన్సార్ ఇంటిగ్రేషన్ అండ్ అప్లికేషన్స్-బ్రిడ్జింగ్ ది ఫిజికల్ అండ్ డిజిటల్ వరల్డ్ అనే అంశంపై జరుగుతున్న వర్క్‌షాప్ సోమవారం ముగిసింది. ఇందులో విద్యాసంస్థల చైర్మన్ పల్లె కిశోర్ పాల్గొని మాట్లాడారు. వర్క్‌షాపులు అంతర్జాతీయ, జాతీయ స్థాయిలో విద్యార్థులు ప్రతిభ చాటడానికి దోహదపడుతాయని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బండిరమేష్‌బాబు, యాజమాన్య ప్రతినిధి శ్రీకాంత్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ దీప్తి జోర్దాన, ఏఓ మనోహర్‌రెడ్డి, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి సుదర్శన్, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

మాజీ యానిమేటర్‌పై కలెక్టర్‌కు ఫిర్యాదు

అనంతపురం రూరల్,ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆకుతోటపల్లి మాజీ యానిమేటర్‌పై స్థానిక డ్వాక్రా సంఘాల సభ్యులు కలెక్టర్ వినోద్‌కుమార్ ఫిర్యాదు చేశారు. గ్రామంలోని 30సంఘాల పరిధిలోని సభ్యులు సోమవారం కలెక్టరేట్‌కు వెళ్లి ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశారు. గత ప్రభుత్వంలో పనిచేసిన యానిమేటర్ నిధుల స్వాహా తీరును వివరించారు. గ్రామంలో డ్వాక్రా మహిళలకు సంబంధించిన డబ్బును సొంత అకౌంట్‌లోకి జమ చేసుకుందని, దాదాపు రూ.30లక్షల వరకు వాడుకుందని తెలిపారు. డబ్బు తిరిగి చెల్లించమంటే ఆమె నుంచి సరైన స్పందన లేదన్నారు. వెంటనే ఆ మాజీ యానిమేటర్ నుంచి త్వరిగతిన డబ్బులు రికవరీ చేయించాలని వారు కోరారు.

'జన సురక్షతో ఎంతో ప్రయోజనం'

గార్లదిన్నె, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): జన సురక్షతో బ్యాంకు ఖాతాదారులు పలు ప్రయోజనాలు పొందవచ్చునని కెనరా బ్యాంకు మేనేజర్ వెంకట శివారెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలో సోమవారం ఆయన ఎస్‌హెచ్‌జీ మహిళా సంఘాల సభ్యులతో సమావేశం ఏర్పాటు చేసి జనసురక్ష పథకంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... బ్యాంకు ఖాతా ప్రారంభించి 10 సంవత్సరాలు పూర్తి అయిన వారు కేవైసీ చేయించు కోవాలన్నారు. దీని వల్ల పీఎంజేజేబీవై, పీఎంఎస్‌బీవై ఇన్సూరెన్స్ పథకాలు వినియోగించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఏపీఎం మల్లికార్జున, సీసీ రామాంజి, కెనరా బ్యాంకు ఫైనాన్స్ లిటరసీ సభ్యులు బుక్ కీపర్లు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

ఘనంగా బీడీ కార్మికుల మహాసభ



మహాసభలో పాల్గొన్న ఓబులు, బీడీ కార్మికులు

తాడిపత్రి, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్జీఓ హోంలో సోమవారం ఏపీ బీడీ అండ్ సిగార్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో బీడీ కార్మికుల మహాసభను సోమవారం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా రాష్ట్ర కన్వీనర్ ఓబులు, జిల్లా అధ్యక్షులు నాగమణి హాజరయ్యారు. ఓబులు మాట్లాడుతూ పట్టణంలో ఏడు వేలమందికి పైగా కార్మికులు బీడీ పరిశ్రమను నమ్ముకొని పనిచేస్తున్నారని, వారికి కనీస వేతనం కూడా చెల్లించడం లేదని అన్నారు. 1966, 1976 కార్మిక సంక్షేమ చట్టాలను కేంద్రప్రభుత్వం రద్దుచేయడం దారుణమన్నారు. బీడీ కార్మికులకు ఇళ్లస్థలాల కేటాయించాలన్నారు. అనంతరం 10 మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాయకులు జగన్‌మోహన్‌రెడ్డి, నరసింహారెడ్డి, హనుమంతరెడ్డి పాల్గొన్నారు.

నేటి నుంచి ఆధార్ శిబిరం

యాడికి, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): యాడికి సచివాలయం-1లో ఈ నెల 19, 20, 21, 22, 23, 28, 29, 30 తేదీల్లో ప్రత్యేక ఆధార్ శిబిరాన్ని నిర్వహిస్తున్నామని, ప్రజలు దీన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ వీరరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఆధార్ కార్డులో మార్పులు, చేర్పులు తదితర సేవలను అందిస్తామన్నారు.

ప్రజా సమస్యలు పట్టని సభ్యులు

ఉరవకొండ, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): స్థానిక పంచాయతీ కార్యాలయ భవనంలో సోమవారం నిర్వహించిన పంచాయతీ సర్వసభ్య సమావేశాన్ని పాలకులు, అధికారులు కేవలం 15 నిమిషాల్లోనే ముగించేశారు. ఏ ఒక్క ప్రజా సమస్యపై కూడా చర్చించలేదు. అజెండాలోని అంశాలను చదివేసి మ..మ.. అనిపించారు. సగానికి పైగా వార్డు సభ్యులు ఈ సమావేశానికి డుమ్మా కొట్టారు. సీజనల్ వ్యాధులు.. పారిశుధ్యంపైన కనీసం అధికార, ప్రతిపక్ష పార్టీ వార్డు మద్ధతుదారులు నోరు మెదప లేదు.

విశ్రాంతి భవనం ప్రారంభం

గుత్తి, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): గుత్తి రైల్వే డిజిల్ షెడ్‌లో కార్మికుల నూతన విశ్రాంతి గదిని డీజిల్ షెడ్ సీనియర్ డీఎంఈ ప్రమోద్, ఉమేన్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ అధ్యక్షురాలు ప్రియాంక ప్రమోద్ సోమవారం ప్రారంభించారు. డీజిల్ షెడ్‌లో ఎలక్ట్రికల్, డీజిల్ లోకోల నిర్వాహణలో శ్రమించే కార్మికులకు విశ్రాంతి తీసుకునేందుకు దీన్ని ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో ఏడీఎంఈలు అశోక్‌గౌడ్, సుంకన్న, ఏడీఎస్ నారాయణ, ఎస్ఎస్ఈ జనరల్ మనోజ్, గోవిందరాజులు, విజాయనంద్, మజ్దూర్ యూనియన్ బ్రాంచ్ సెక్రెటరీ రామాంజనేయుల రెడ్డి, బ్రాంచ్ చైర్మన్ మంజునాథ్, ఎస్సీ ఎస్టీ సెక్రెటరీ రామ్‌నాయక్ పాల్గొన్నారు.

ఆసుపత్రికి ర్యాకుల వితరణ



దాత రెహమాన్‌ను సన్మానిస్తున్న వైద్యుడు

పామిడి, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి) : స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ)కి స్థానిక నైటీల వ్యాపారస్థుడు నల్లఖాదర్ రెహమాన్ రూ. 20 వేలు విలువైన ర్యాకులను సోమవారం అందజేశారు. ఆసుపత్రిలో మందులను నిల్వ చేసుకోవడానికి ఈ ర్యాకులు అందజేసినట్లు దాత తెలిపారు. దీంతో ఆయన్ను సీహెచ్‌సీ వైద్యాధికారి శివ కార్తీక్ రెడ్డి, హాస్పిటల్ డెవలప్‌మెంట్ కమిటీ మెంబర్ చిలకల రాజగోపాల్ సన్మానించారు.

యూరియా పంపిణీ

యల్లనూరు, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): మండలంలో సోమవారం 280 మంది రైతులకు యూరియా పంపిణీ చేసినట్లు ఇన్‌చార్జి వ్యవసాయ అధికారి మధు తెలిపారు. యల్లనూరు, నిట్టూరు రైతుసేవా కేంద్రాల్లో పట్టాదారు పాసుపుస్తకం తీసుకువచ్చిన రైతులకు రెండు బస్తాలు చొప్పున ఇచ్చామన్నారు. యూరియా కోసం ఉన్నతాధికారులకు నివేదిక పంపినట్లు తెలిపారు.

'ఎమ్మెల్యే క్షమాపణ చెప్పాలి'

రాయదుర్గం రూరల్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): జూనియర్ ఎన్టీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుబాటి వెంటనే క్షమాపణ చెప్పాలని నందమూరి అభిమానుల సంఘం పట్టణ అధ్యక్షుడు సత్యానారాయణ సతీష్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక శాంతినగర్‌లోని ఎన్‌టీఆర్ విగ్రహం వద్ద చేపట్టిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తెలుగుదేశం పార్టీ... ఎన్‌టీఆర్ వేరు కాదని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అభిమాన సంఘం నాయకులు సిద్ధప్ప, ములకన్న, రాము, సిద్ధలింగ పాల్గొన్నారు.

మరుగుదొడ్లు లేక విద్యార్థుల పాట్లు

కూడేరు, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆరు నుంచి పదో తరగతి వరకు మొత్తం 435 మంది విద్యార్థులున్నారు. అందులో 245 మంది బాలురు, 190 మంది బాలికలు. 190 మంది బాలికలకు కేవలం మూడు మరుగుదొడ్లు మాత్రమే ఉన్నాయి. ఇక బాలురకు మరుగుదొడ్లే లేవు. దీంతో వారు ఆరుబయటకు వెళ్లాల్సి వస్తోంది. విద్యాశాఖ అధికారులు స్పందించి మరుగుదొడ్లు నిర్మించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



ఆరుబయటకు మూత్ర విసర్జనకు వెళ్తున్న బాలురు

జమకాని అన్నదాత సుఖీభవ నగదు

గుత్తి, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ పథకం నగదు తమకు జమకాలేదని మండలంలోని పలువురు రైతులు వాపోతున్నారు. గ్రామ సచివాలయాల్లో వారు సంప్రదించగా.. మండల వ్యవసాయ కార్యాలయానికి వెళ్లి.. ఫిర్యాదు చేయాలని వారు సూచించారు. దీంతో మండలంలోని రైతులు సోమవారం వ్యవసాయ కార్యాలయానికి వచ్చారు. తమకు పీఎం కిసాన్ యోజక కింద రూ. 2వేలు జమ అయ్యిందని, రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న రూ. 5 వేలు జమకాలేదని వాపోయారు. దీనిపై వ్యవసాయ కార్యాలయంలో అధికారులను సంప్రదించామన్నారు. అర్హులైన ప్రతి రైతుకు ఈ పథకం వర్తిస్తుందని, రైతులందరికి న్యాయం జరిగేలా చర్యలు చేపడతామని మండల వ్యవసాయ అధికారి ముస్తాక్ అహ్మద్ హామీ ఇచ్చారన్నారు.



మండల వ్యవసాయాధికారి కార్యాలయం వద్ద రైతులు

గ్రామీణ రహదారులు ఛిద్రం

చిన్నపాటి వానకే బురదమయం



బురదమయమైన తొండపాడు-గొందిపల్లి రోడ్డు

గుత్తిరూరల్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): మండలంలో గ్రామీణ రహదారులు ఘోరంగా తయారయ్యాయి. తొండపాడు నుంచి గొందిపల్లికి వెళ్లే రోడ్డు చిన్నపాటి వనోస్తే చాలు.. మొత్తం బురదమయంగా మారుతోంది. పది రోజుల నుంచి వర్షం పడుతుండంతో ప్రస్తుతం మరీ ఘోరంగా తయారైంది. తొండపాడు నుంచి గొందిపల్లికి 2019లో బీటీ రోడ్డు వేసినా... మధ్యలో కిలో మీటరు మేరకు మట్టి రోడ్డుని అలాగే వదిలేశారు. ఈ దారి గుండా గొందిపల్లికి, నంద్యాల జిల్లా మామిళ్ళపల్లి, రాంపురం, జక్కసానికుంట్ల, పీఆర్ పల్లికి ద్విచక్రవాహనాలు, ఆటోలు వెళ్తుంటాయి. వర్షం వచ్చింది అంటే చాలు ఈ దారి బురదమైమయి వాహనాలు ఇరుక్కుపోతుంటాయి. ద్విచక్రవాహనదారులు జారి పడటంతో అనేక మంది గాయపడ్డారు. రాత్రి వేళల్లో ఈ రోడ్డుపై వెళ్లడానికి గ్రామస్థులు జంకుతున్నారు. అలాగే ధర్మాపురం రోడ్డు కూడా వర్షలకు పూర్తిగా ధ్వంసమైంది. రోడ్డు అంత గుంతలు ఏర్పడి వర్షపు నీటితో నిండి పోయి ఉండటంతో.. ఎక్కడ గుంత ఉండేది తెలియక వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. కర్నూలుకు వెళ్లే 44వ జాతీయ రహదారి నుంచి మూడు కిలో మీటర్ల దూరంలో ధర్మాపురం గ్రామం ఉంది. 15 సంవత్సరాల క్రితం ఈ గ్రామానికి వేసిన బీటీ రోడ్డు పూర్తిగా దెబ్బతిని.. కంకర తేలి.. గుంతలు పడ్డాయి. పాలకులు, అధికారులు స్పందించి ఈ రోడ్లను బాగు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.





ప్రతిష్ఠించిన కలశం, కుంభాలను ఊరేగిస్తున్న భక్తులు

ఘనంగా కలశ, విగ్రహాల ప్రతిష్ఠ

విడపనకల్లు, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): స్థానిక కోట ఆంజనేయస్వామి ఆలయంలో భక్తులు సేకరించిన విరాళాలతో ఆలయాన్ని మొత్తం జీర్ణోద్ధారణ చేశారు. గోపురంపై నూతన కలశాన్ని ప్రతిష్ఠించారు. అదే విధంగా నవగ్రహాలు, నాగుల విగ్రహాలను ప్రతిష్ఠించారు. సోమవారం తెల్లవారుజామున యంత్ర స్థాపన, విగ్రహ ప్రతిష్ఠ, ప్రాత:కాల పూజా, కోట ఆంజనేయ స్వామికి పంచామృత రామ తారక హోమం, వన్యన్యూక్తి హోమం నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో పంచ కుభాలు ఊరేగించారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో అన్నసంతర్పణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమలో గ్రామ పెద్దలు, వేద పండితులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి అండగా ఉంటాం



చిన్నారిని పలకరిస్తున్న అమిలినేని యశ్వంత్

కళ్యాణదుర్గం, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో నాలుగు రోజుల క్రితం ఆత్మహత్య చేసుకున్న శ్రావణి కుటుంబానికి టీడీపీ అండగా ఉంటుందని ఎమ్మెల్యే తనయుడు అమిలినేని యశ్వంత్ హామీ ఇచ్చారు. సోమవారం ఆయన టీడీపీ నాయకులు చౌళం మల్లికార్జున, వాల్మీకి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ వైపి రమేష్‌తో కలసి వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. శ్రావణి ఆత్మహత్య చేసుకోవడంతో అనాథగా మారిన మూడేళ్ల చిన్నారి పర్నిత పూర్తి బాధ్యతలను పార్టీ తీసుకుంటుందన్నారు. రూ.రెండు లక్షలను ఆ చిన్నారి అవ్వ, తాతలకు అందజేశారు. ఆ డబ్బును సుకన్య సమృద్ధి యో జన ద్వారా పోస్టాఫీసులో జమ చేసుకోవాలని ఆయన సూచించారు. శ్రావణి ఆత్మహత్యకు కారకులైన వారికి శిక్ష పడేలా చూస్తామని భరోసా ఇచ్చారు.

అవార్డు గ్రహీతలకు సన్మానం



డిప్యూటీ ఎంపీడీఓ దాస్‌ను సన్మానిస్తున్న తహసీల్దార్, ఎంపీడీఓ

బొమ్మనహాళ్, ఆగస్టు 18, (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి చేతుల మీదుగా ఉత్తమ అధికారులుగా అవార్డులు అందుకున్న డిప్యూటీ ఎంపీడీఓ దాస్, గ్రామ సర్వేయర్ నాగరాజు, వీఆర్వో కిరణ్‌ను సోమవారం తహసీల్దార్ మునివేలు, ఎంపీడీఓ విజయభాస్కర్, సిబ్బంది సన్మానించారు. అంకిత భావంతో పనిచేస్తేనే గుర్తింపు లభిస్తుందని తహసీల్దార్, ఎంపీడీఓ అన్నారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ హనుమంతప్ప, ఆర్ఐ బాలకృష్ణ, వీఆర్వోలు నరసింహమూర్తి, సుజాత, యుగంధర్, శృతి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి యోగా పోటీలకు ఎంపిక



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

గుంతకల్లుటౌన్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): స్థానిక మాంటిసోరి హైస్కూల్‌లో సోమవారం అనంతపురం జిల్లా యోగా అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి యోగా పోటీలకు క్రీడాకారులను ఎంపిక చేశారు. అసోసియేషన్ సెక్రెటరీ మనోహర్ రెడ్డి మాట్లాడుతూ.. ఈ పోటీలకు నల్గొండ, కదిరి, అనంతపురం, తాడిపత్రి, కల్యాణదుర్గం, గుత్తి ప్రాంతాల నుంచి క్రీడాకారులు హాజరయ్యారన్నారు. 8సంవత్సరాల నుంచి 45 సంవత్సరాల విభాగాలలో బాల, బాలికలు, మహిళలు, పురుషులు ఎంపికయ్యారు. ఈ క్రీడాకారులు వచ్చే నెల 6, 7 తేదీల్లో తాడేపల్లి గూడెంలో జరిగే రాష్ట్ర స్థాయి యోగా పోటీల్లో పాల్గొంటారన్నారు. స్కూల్ డైరెక్టర్లు కర్ణాటక నాగార్జున, అనిల్‌కుమార్, వంశీ కృష్ణ క్రీడాకారులను అభినందించారు.

ఘనంగా డోణ గంగమ్మ జాతర



డోణగంగమ్మ పూజలు నిర్వహిస్తున్న భక్తులు

రాయదుర్గంరూరల్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని టీ వీరాపురంలో డోణగంగమ్మ జాతర మహోత్సవాన్ని సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయాన్నే అమ్మవారికి గంగపూజ, పంచామృతాభిషేకం, కుంకుమార్చన, పుష్పాలంకరణ, వస్త్రాలంకరణ చేశారు. మధ్యాహ్నం అమ్మవారిని రథంలో ఊరేగింపు నిర్వహించారు. ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేలాది మంది భక్తులు ఇందులో పాల్గొన్నారు. ఏటా శ్రావణమాసం ముగింపు రోజున అమ్మవారికి ఈ జాతర కార్యక్రమాన్ని నిర్వహించడం ఆనవాయితీ వస్తోందని గ్రామ పెద్దలు తెలిపారు.

పల్లకి ఉత్సవం



ఉత్సవ విగ్రహాలను ఊరేగిస్తున్న భక్తులు

కణేకల్లు, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): శ్రావణమాస చివరి సోమవారం సందర్భంగా స్థానిక శ్రీచిక్కణ్ణేశ్వర స్వామి, సిద్ధప్పస్వామి ఉత్సవ విగ్రహాలను సోమవారం పల్లకిలో ఊరేగించారు. అధిక సంఖ్యలో భక్తులు ఇందులో పాల్గొన్నారు.

అభివృద్ధికి సూచనలివ్వండి: విప్



బీటీపీలో పట్టాలు పంపిణీ చేస్తున్న విప్ కాలవ

రాయదుర్గం, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): పట్టణ అభివృద్ధికి సూచనలు ఇవ్వాలని పట్టణవాసులకు ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు కోరారు. స్థానిక సీతారామాంజనేయ కళ్యాణ మండపంలో సోమవారం నిర్వహించిన పురపాలక సంఘం సమావేశంలో డ్రాఫ్ట్ మాస్టర్ ప్లాన్ నోటిఫికేషన్ గురించి ఆయన వివరించారు.

● అదనపు యూరియా ఇవ్వండి : నియోజకవర్గంలో యూరియా కొరత అధికంగా ఉందని, అదనంగా యూరియాను ఇవ్వాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెనాయుడుకు ఎమ్మెల్యే కాలవ ఫోన్‌లో విన్నవించారు. పట్టణంలోని తన స్వగృహంలో సోమవారం వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు వారి సిబ్బందితో కాలవ సమీక్ష నిర్వహించారు. యూరియా కొరత ఉందనీ, అదనంగా సరఫరా చేయాలని మంత్రిని కోరారు.

రైతు సేవాకేంద్రం ప్రారంభం

గుమ్మఘట్ట: మండలంలోని బీటీపీ గ్రామంలో ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు రైతుసేవా కేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు. అనంతరం గ్రామంలోని పది మంది నిరుపేదలకు ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ కన్వీనర్ గిరిమల్లప్ప, క్లస్టర్ ఇన్‌ఛార్జ్ కాలవ సన్నన్న, ఎంపీపీ భవానీ, తహసీల్దార్ రజాక్‌వలి, ఎంపీడీఓ రామకృష్ణ, వ్యవసాయ అధికారి నిర్మల్‌కుమార్, స్థానిక నాయకులు మూర్తి, సూరి, చిన్న కిష్టయ్య, అంజి పాల్గొన్నారు.

● ముందస్తుగానే సాగునీరు

బీటీ ప్రాజెక్టు కింద కుడి, ఎడమ కాలువలకు ముందస్తుగానే ఈ ఏడాది డిసెంబరు మొదటి వారంలో రబీ పంటలకు సాగునీరు అందించే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. సోమవారం మధ్యాహ్నం బీటీపీ ప్రాజెక్ట్‌ను ఆయన సందర్శించారు. కాలువల మరమ్మతు పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

1,810 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు 1,810 ఇన్‌ఫ్లో క్యూసెక్కులు, ఔట్‌ఫ్లో కింద పీఏబీఆర్‌కు 1,928 క్యూసెక్కులు వెళ్తున్నట్లు హంద్రీనీవా అధికారులు సోమవారం తెలిపారు. ఆదివారం నుంచి ఫేజ్-2కు 118 క్యూసెక్కులు వెళుతుండగా నీటి నిల్వ 1.787 టీఎంసీలు ఉందని చెప్పారు.

బొగ్గుల ఫ్యాక్టరీని బంద్ చేయించండి

కలెక్టర్‌కు మాళాపురం గ్రామస్థుల వినతి

విడపనకల్లు, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని మాళాపురం గ్రామ వద్ద ఏర్పాటు చేసిన కట్టెల బొగ్గుల ఫ్యాక్టరీని బంద్ చేయించాలని ఆ గ్రామ ప్రజలు.. కలెక్టర్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. గ్రామ సమీపంలో దాదాపు 30 బొగ్గుల బట్టీలు ఏర్పాటు చేశారని, వాటి ద్వారా వచ్చే పొగతో గ్రామస్థులు, సమీపంలోని కేజీబీవీ విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. అనేక మంది రోగాల బారిన పడుతున్నారని, ఆ బొగ్గుల ఫ్యాక్టరిని బంద్ చేయించాలని కోరారు.

పింఛన్లను పునరుద్ధరించండి

కణేకల్లు: అనర్హుల పేరుతో తొలగించిన దివ్యాంగుల పింఛన్లను పునరుద్ధరించాలని దివ్యాంగుల హక్కుల జాతీయవేదిక జిల్లా అధ్యక్షుడు వసంత్‌కుమార్, జిల్లా కార్యదర్శి రామయ్య కలెక్టర్‌ను కోరారు. కొంతమంది అర్హులున్నప్పటికీ వారికి పింఛన్లను తొలగించారన్నారు.

● గుంతకల్లుటౌన్: వెరిఫికేషన్ పేరుతో అర్హులైన వికలాంగుల పింఛన్లు తొలగించారని వెంటనే వారి పింఛన్లు పునరుద్ధరించాలని సీపీఐ నాయకులు మున్సిపల్ కమిషనర్ నయీమ్ అహ్మద్‌కు వినతిపత్రం అందజేశారు. పట్టణంలో పలు రోడ్లను వెడల్పు చేసి.. వీధిదీపాలను ఏర్పాటు చేయాలన్నారు.



కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న మాళాపురం గ్రామస్థులు

● కుక్కల బెడద నుంచి ప్రజలను కాపాడాలని, అలాగే మురుగు కాలువల్లో పూడిక తీయించాలని గుంతకల్లు మున్సిపల్ కార్యాలయం వద్ద సీపీఎం నాయకులు ధర్నా నిర్వహించారు. మున్సిపల్ కమీషనర్‌కు వినతి పత్రం అందజేశారు.

ఎస్ఎఫ్ఐ ధర్నా

గుత్తి: డిగ్రీ అడ్మిషన్లను వెంటనే చేపట్టాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు తరిమిల గిరి, రాష్ట్ర కమిటీ సభ్యుడు రమేష్ మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా విద్యా సంవత్సరం ప్రారంభమై మూడు నెలలు కావస్తున్న డిగ్రీ విద్యార్థులకు కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభం కాలేదన్నారు.

● ఉపాధి పనులు కల్పించాలి: గుత్తి పట్టణంలో గతంలో జాబ్ కార్డులు ఇచ్చిన కూలీలకు ఉపాధి హామీ పథకం కింద పనులు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. కూలి పనులు లేక కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. పెండింగ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. తహసీల్దార్ పుణ్యవతికి వినతి పత్రం అందజేశారు.

పురాతన భవనాన్ని తొలగించండి

రాయదుర్గంరూరల్: మండలంలోని 74 ఉడేగోళం ఎస్సీకాలనీలోని ప్ర భుత్వ పాఠశాల ముందు ఉన్న పాత కమిటీహాల్‌ను తొలగించేలా చర్యలు తీసుకోవాలని హెచ్ఎం సునీల్ ఎంపీడీఓ కొండన్నను విజ్ఞప్తి చేశారు. వర్షాకాలం కావడంతో అది ఎప్పుడైనా కూలే ప్రమాదముందన్నారు.

క్రైం న్యూస్..

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

వైద్యుల నిర్లక్ష్యమే కారణమని బంధువుల ఆందోళన



ఆందోళన చేస్తున్న బంధువులు, మారెప్ప మృతదేహం (ఇన్‌సెట్లో)

గుత్తి, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): పెద్దవడుగూరు మండలం జీ వెంకటాంపల్లి గ్రామానికి చెందిన మారెప్ప (70) నాలుగు రోజులుగా జ్వరంలో బాధపడుతున్నాడు. ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్సలు అందించిన కుటుంబ సభ్యులు.. సోమవారం అతన్ని గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువచ్చారు. ఆసుపత్రిలో మారెప్ప చికిత్స పొందుతూ సాయంత్రం మరణించాడు. మారెప్ప మృతికి వైద్యుల నిర్లక్ష్యమే కారణం అంటూ బంధువులు ఆస్పత్రి ఎదుట ఆందోళన చేపట్టారు. వైద్యులు కనీసం మారప్ప చేయి కూడా పట్టుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వీరికి ఎమ్మార్పీఎస్ నాయకులు మద్దతు తెలిపారు. సీఐ వెంకటేశ్వర్లు సంఘటన స్థలానికి చేరుకుని ఆందోళనకారులతో చర్చించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ ఎల్లప్ప, సీఐ ఇరువురు బంధువులతో మాట్లాడి వారికి సర్దిచెప్పడంతో ఆందోళన విరమించారు. పోలీసులు విచారణ చేపట్టారు.

కోలుకోలేక..

బొమ్మనహాళ్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని కలుదేవనహళ్లి వాసి తిప్పన్న (54) బళ్లారి విమ్స్‌లో చికిత్స పొం దుతూ మరణించాడు. మండలంలోని గోవిందవాడ క్రాస్ సమీపంలో ఇటీవల రెండు బైక్‌లు ఢీకొన్న ప్రమాదంలో తిప్పన్న తలకు బలమైన గాయమైంది. దీంతో అతన్ని బళ్లారి విమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం అర్ధరాత్రి మరణించినట్లు బొమ్మనహాళ్ ఏఎస్ఐ హనుమంతరెడ్డి తెలిపారు. తిప్పన్న భార్య యల్లమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి.. దర్యాప్తు చేపట్టామని తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య

బెళుగుప్ప, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీడిపల్లిలో నివాసముంటున్న ప్రకాష్ (47) సోమవారం తన ఇంట్లో ఉరేసుకొని.. ఆత్మహత్య చేసుకున్నాడు. ఇతనికి భార్య పద్మావతి, ఇద్దరు కుమారులు. కొద్ది కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ప్రకాష్ .. జీవితంపై విరక్తి చెంది.. ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

చోరీకి యత్నం



దొంగలు వదిలేసిన కారు

డీ.హీరేహాళ్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): స్థానిక ఓ వెల్డింగ్ దుకాణంలో దుండగులు దొంగతనానికి యత్నించి.. విఫలయ్యారు. స్థానిక నేషనల్ హైవే పక్కన పంపాపతి ఓ వెల్డింగ్ షాప్ నిర్వహిస్తున్నాడు. సోమవారం తెల్లవారుజామున కేఏ 02 ఎంఏ 1428 నెంబరు గల టాటా ఇండికా వాహనంలో కొంతమంది దొంగలు ఆ వెల్డింగ్ షాప్ నందు దూరి.. వైర్లు, ఇతర ఐరన్ సామగ్రిని దొంగలించి కారులో వేసుకున్నారు. అదే సమయంలో ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి తన సిబ్బందితో జీపులో అటుగా రావడంతో.. దాని సైరన్ విన్న దొంగలు తమ వాహనంలో అక్కడి నుంచి పారిపోవడానికి యత్నించారు. అయితే కారు అదుపు తప్పి.. కాలువలో ఇరుక్కుపోయింది. దీంతో వారు ఆ కారును అక్కడే వదిలేసి.. పారిపోయారు. పోలీసులు ఆ కారును స్వాధీనం చేసుకున్నారు. పంపాపతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

టీడీపీ నాయకుల హౌస్ అరెస్ట్

యాడికి, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): పట్టణంలో సోమవారం శివుడి విగ్రహావిష్కరణ ఉండడం, మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి తాడిపత్రికి వస్తుండడంతో ఉద్రిక్తవాతావరణం నెలకొంది. ఈ నేపథ్యంలో టీడీపీ నాయకులు తాడిపత్రికి వెళ్లకుండా పలువురిని హౌస్ అరెస్ట్ చేశారు. టీడీపీ మండల కన్వీనర్ రుద్రమనాయుడు, తెలుగుయువత జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీ పరిమి చరణ్, ఎస్సీసెల్ జిల్లా ఉపాధ్యక్షుడు లక్ష్మణ్‌ను హౌస్ అరెస్ట్ చేశారు.

తిమ్మంపల్లిలో పోలీసు బందోబస్తు

యల్లనూరు, ఆగస్టు18(ఆంధ్రజ్యోతి): తిమ్మంపల్లిలో సోమవారం ఉదయం నుంచి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఉదయం తాడిపత్రికి పెద్దారెడ్డి వెళుతుండడంతో ఆయన అనుచరులు తిమ్మంపల్లికి చేరుకున్నారు. పెద్దారెడ్డి తిరిగి తిమ్మంపల్లికి చేరుకునేంతవరకూ పోలీసులు అనుచరుల కదిలికలపై నిఘా వేశారు.

వైభవంగా కృష్ణాష్టమి



శ్రీకృష్ణుడి ప్రతిమను ఊరేగిస్తున్న భక్తులు

ఉరవకొండ, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): పట్టణంలో కృష్ణాష్టమి వేడుకలను త్రైతసిద్ధాంత ప్రభోద సేవా సమితి ఆధ్వర్యంలో సోమవారం వైభవంగా నిర్వహించారు. కృష్ణుడి మూల విరాట్‌ను పల్లకిలో ఊరేగించారు. కార్యక్రమంలో త్రైతసిద్ధాంత ప్రభోద సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.

అందరికీ యూరియా ఇస్తాం: ఏడీఏ

బొమ్మనహాళ్, ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, తప్పకుండా అందరికీ యూరియా ఇస్తామని రాయదుర్గం ఏడీఏ పద్మజ అన్నారు. యూరియా కొరత ఉందనే పుకార్లను రైతులు నమ్మరాదన్నారు. సోమవారం బొమ్మనహాళ్‌లోని రెవిన్యూ కార్యాలయంలో తహసీల్దార్ మునివేలు, ఏవో సాయికుమార్‌తో కలిసి వీఆర్వోలతో సమీక్ష నిర్వహించారు. బొమ్మనహాళ్, కణేకల్లు మండలాల్లో గతంలో మాదిరి పెద్దమొత్తంలో సొసైటీలు, రైతు సేవా కేంద్రాల్లో యూరియా నిల్వ లేకపోవడంతోనే రైతుల్లో ఈ ఆందోళన నెలకొందన్నారు. ఒక కేంద్రానికి 280 బస్తాలు రావడం.. రైతులందరు ఒకేసారి కేంద్రం వద్దకు రావడంతో వారిని తిరిగి పంపించాకుండా రెండు బస్తాలు ఇచ్చామన్నారు. మండలంలో ఐదు రోజుల్లోనే 88 టన్నులు యూరి యాను పంపిణీ చేశామని, మరో రెండు రోజుల్లో శ్రీధరఘట్ట, ఎళాం జి, గోనేహాళ్, డీ. హొన్నూరు రైతు సేవా కేంద్రాలకు 12 టన్నుల చొప్పున యూరియా వస్తుందని అన్నారు. మండలానికి విడతల వారీగా వస్తుందన్నారు. ఈ సమా వేశంలో ఆర్ఐ బాలకృష్ణ, వీఆర్వోలు నరసింహమూర్తి, నాగరాజు, శృతి, యుగంధర్, నరసింహారావు, యోగేంద్ర పాల్గొన్నారు.